


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 290 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | మంగళవారం 23 జూన్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :290 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | TUE 23 JUNE 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం..

## ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!

- లేబర్ పార్టీ నాయకత్వాన్నీ వీడుతున్నట్లు ప్రకటన
- సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి
- దేశ ప్రయోజనాల కోసమే నిర్ణయమని స్టార్మర్ వ్యాఖ్య
- 100 మందికిపైగా ఎంపీల నుంచి రాజీనామా డిమాండ్
- పదేళ్లలో బ్రిటన్‌కు ఏడో ప్రధాని మార్పు

పెన్ పవర్ డెస్క్:బ్రిటన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ (63) తన పదవికి, అధికార లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సొంత పార్టీ

- మిగతా 2లో

# ప్రపంచంలోనే అతిపెద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ మనదే

## హైదరాబాద్ లో కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్

- క్యాన్సర్‌పై కేంద్ర ప్రభుత్వం సమగ్ర యుద్ధం ప్రకటించిందన్న అనుప్రియ పటేల్
- ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీనింగ్ కార్యక్రమం దేశంలో అమలు
- బసవతారకం ఆస్పత్రి సేవలను కొనియాడిన కేంద్ర మంత్రి
- ఆయుష్మాన్ భారత్ ద్వారా 62 కోట్ల మందికి క్యాన్సర్ చికిత్స భద్రత
- బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందిస్తున్నామన్న మంత్రి




పెన్ పవర్ డెస్క్:క్యాన్సర్ మహమ్మారిపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర యుద్ధం ప్రకటించిందని, ఇందులో భాగంగా ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీనింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. హైదరాబాద్‌లోని బసవతారకం

- మిగతా 2లో

## డబ్బులేక ఏ ఒక్కరూ క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు



పెన్ పవర్ డెస్క్: పేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైందని ఆసుపత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రోజుకి 35 నుంచి 40 శస్త్రచికిత్సలు చేస్తున్నామని.. వేలాది మందికి ఇది ఓ ఆశాకిరణమని చెప్పారు.

- మిగతా 2లో

## లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి.. దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- లక్నో కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం
- ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారణ
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటన
- సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు



పెన్ పవర్ డెస్క్:ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో

- మిగతా 2లో

## బసవతారకం ఆసుపత్రి ఆ స్ఫూర్తితోనే పనిచేస్తోంది

- బసవతారకం ఆసుపత్రి సేవలను కొనియాడిన వెంకయ్యనాయుడు
- మారుతున్న జీవనశైలి వల్లే క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని ఆందోళన
- విద్య, వైద్యం ఉచితంగా అందించడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సూచన
- క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రభుత్వాలు తప్పనిసరి చేయాలని విజ్ఞప్తి
- బసవతారకం ఆసుపత్రి సేవలను అమరావతికి విస్తరించాలని కోరిక



- మిగతా 2లో



## హైదరాబాదులో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం.. హాజరైన సీఎం చంద్రబాబు

- హైదరాబాద్‌లో ఘనంగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- డబ్బు లేదనే కారణంతో ఏ రోగికి చికిత్స ఆగకూడదన్నదే లక్ష్యమన్న బాలకృష్ణ
- అమరావతిలోనూ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తున్నామని వెల్లడి
- ఇప్పటివరకు 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించినట్లు వివరణ

పెన్ పవర్ డెస్క్:హైదరాబాదులోని బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ (25వ వార్షికోత్సవ) వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఆసుపత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలకు అండగా నిలవాలనే గొప్ప లక్ష్యంతోనే ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఈ సభలో తాను నటుడిగానో, ఎమ్మెల్యేగానో కాకుండా ఒక కొడుకుగా మాట్లాడుతున్నానని బాలకృష్ణ భావోద్వేగంగా ప్రసంగించారు. తన తల్లి బసవతారకం గారు క్యాన్సర్‌తో బాధపడ్డారని, డబ్బు ఉన్నందున తాము పోరాడగలిగామని గుర్తు చేసుకున్నారు. "డబ్బు లేని పేదలు ఈ మహమ్మారి బారిన పడితే వారి పరిస్థితి ఏంటి?" అని తన తల్లి అడిగిన మాటే ఈ ఆసుపత్రి ఏర్పాటుకు స్ఫూర్తినిచ్చిందని వివరించారు. డబ్బు లేదనే కారణంతో ఏ ఒక్క క్యాన్సర్ రోగికి చికిత్స అందకుండా పోకూడదన్నదే తమ ధ్యేయమని బాలకృష్ణ పునరుద్ఘాటించారు. 25 ఏళ్ల క్రితం చేసిన ఈ ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నామని, భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం

- మిగతా 2లో

# కుట్రలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం.. అప్రమత్తంగా ఉండాలి

## చంద్రబాబుఅధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

- కొన్ని పార్టీలు ప్రతి అంశానికి కుల, మత రంగు పులుముతున్నాయని ఆరోపణ
- ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచన
- ఉద్యోగులు, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశం
- రాష్ట్రంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ప్రతి సంఘటనకు కుల, మత రంగు పులిమి, వివాదాస్పదం చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు దుష్ప్రచారం, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. విద్వేషాలను రెచ్చగొట్టేలా సాగుతున్న తప్పుడు ప్రచారాలను, ఘటనలను అరికట్టేందుకు అధికారులు, ఉద్యోగులు చొరవ చూపాలన్నారు. ఇటీవల జరిగిన కొన్ని నేరాలకు మానసిక సమస్యలు, మరికొన్నింటికి గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం కారణమని ఆయన విశ్లేషించారు. ప్రభుత్వం పాత కేసులను సైతం పరిష్కరిస్తోందని, 2019లో జరిగిన నేరాలను ఇప్పుడు గుర్తించి నిందితులను పట్టుకుని శిక్షలు పడేలా చేస్తున్నామని తెలిపారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరనే వాస్తవాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.
వాహనాల నంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగానే నంబర్ ప్లేట్లు ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సాంకేతికత కీలకమని, ఈ నేపథ్యంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో క్వాంటం కంప్యూటర్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రత, జల భద్రత, భూగర్భ జలాల రీఛార్జ్, నదుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.
ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)

- మిగతా 2లో



## 10 సూత్రాల అమలు.. సీఎం చంద్రబాబు సమక్షంలో కీలక ఒప్పందం

- స్వర్ణాంధ్ర 2047 విజన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం
- ప్రణాళికా విభాగంతో కేఆర్‌ఈఏ వర్సిటీకి చెందిన ఐఎఫ్ఎంఆర్ ఎంఓయూ
- 15 శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- జీరో పావర్టీ, వాటర్ సెక్యూరిటీ, డీప్ టెక్ మిషన్లపై తొలుత దృష్టి
- పది సూత్రాల అమలుకు రాష్ట్రస్థాయి కమిటీ, వర్కింగ్ గ్రూపుల ఏర్పాటు

- మిగతా 2లో



## స్థానికుల కోరిక మేరకు నచ్చిన దేవుడి మందిరాలు

పెన్ పవర్ డెస్క్:: గత ప్రభుత్వ హయాంలో విచ్ఛిన్నకర వాతావరణం ఉండేదని, దేవాలయాలకు సరైన ఆదరణ ఉండేది కాదని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సచివాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో దేవాదాయశాఖ రెండేళ్ల పనితీరుపై ఆయన రిపోర్టు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలు సమాజంలో భాగమని గత ప్రభుత్వం మరిచిపోయిందన్నారు." దేవాదాయశాఖ అభివృద్ధి, ప్రగతిని మీ ముందుంచుతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమల నుంచి దేవాదాయ శాఖ ప్రక్షాళన ప్రారంభించింది.

- మిగతా 2లో

## పవన్ కల్యాణ్ మాటలకు నా పీఏ కూడా స్పందించడు

- పవన్ హావభావాలపై సోషల్ మీడియాలో విపరీతంగా మీమ్స్ వస్తున్నాయన్న శ్రవణ్ కుమార్
- సినిమాల్లో కంటే నిజ జీవితంలో అద్భుతంగా నటిస్తున్నారని వ్యాఖ్య
- సుగాలి ప్రీతి కేసులో పవన్ మాట మార్చారని విమర్శ



- మిగతా 2లో

## టెకీ రాధా గాయత్రి కేసులో కీలక పరిణామం.. విచారణాధికారి మార్పు

పెన్ పవర్ డెస్క్: ఉత్తరాఖండ్‌లోని మసూరీలో అనుమానాస్పదరీతిలో మృతి చెందిన టెకీ రాధా గాయత్రి కేసు )లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు విచారణాధికారిని అక్కడి డీజీపీ దీపమ్‌సేథ్ మార్పు చేశారు. మసూరీ ఎస్‌హెచ్‌వో దేవేంద్ర చౌహాన్ ప్రవర్తనపై మృతురాలి తండ్రి సుధాకర్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎస్‌హెచ్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచారణ నుంచి తప్పించారు.



- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## పిఠాపురం రాజకీయ కాక !

పిఠాపురం ఎమ్మెల్యే గారి తాలూకా అని 2024 ఎన్నికల ముందూ తరువాత ఏపీ అంతా ఊగేలా స్లోగన్స్ చేసింది జనసైన్యం. పిఠాపురం అలా ఏపీ ఆంతా హాట్ టాపిక్ తొలిసారి అయింది. ఆ క్రెడిట్ కచ్చితంగా పవన్ కళ్యాణ్ దే. ఎందుకంటే ఆయన వెండితెర మీద పవర్ స్టార్. ఆయన ఫాలోయింగ్ అన్నది ఊహాతీతం. ఆయన క్రేజ్ అన్నది అద్భుతం. అందుకే పిఠాపురం అన్న ఒక అసెంబ్లీ నియోజకవర్గం టాక్ ఆఫ్ ది స్టేట్ అయింది. అది పవన్ అక్కడ నుంచి పోటీ చేయాలని ఎంచుకుని నిలిచి గెలిచిన తరువాత జరిగిన డెవలప్మెంట్స్ గానే వీటిని చూడాల్సి ఉంది.

**పొలికేక గా మారింది :**

పిఠాపురం నుంచి పవన్ పోటీ చేసి గెలిచారు. ఆయన ఆ తరువాత ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఇక రెండేళ్ళ కూటమి పాలనలో కాపులకు న్యాయం జరగడం లేదని వైసీపీ కాపులంతా ఒక చోట చేరి మీటింగ్ పెట్టారు. అది కోనసీమ జిల్లా వేదికగా జరిగింది. ఈ మీటింగ్ తరువాత రాజకీయ ప్రకంపనలు ఒక రేంజిలో సాగుతున్నాయి. జనసేన కాపులు వర్సెస్ వైసీపీ కాపులు అన్నట్లుగా రాజకీయం రంజుగా సాగుతోంది. ఈ మీటింగ్ తరువాత వైసీపీ నాయకురాలు వంగా గీత మీడియాతో మాట్లాడుతూ ఒక కామెంట్ చేశారు. పవన్ కులాన్ని తక్కువ చేయకూడదని అన్నారు. కాపులు ఎక్కువగా ఉన్నారనే కదా పిఠాపురం ఎంచుకుని పోటీ చేశారు అని ఆమె కామెంట్స్ చేశారు. అదే ఇపుడు ఏపీలో రాజకీయ పొలికేక గా మారిపోయింది.

**పంతం నానాజీ ఫైర్ :**

మరో వైపు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే జనసేన నేత పంతం నానాజీ అయితే హాట్ కామెంట్స్ చేశారు. పవన్ పిఠాపురం నుంచి పోటీ చేస్తే తప్పేంటి అన్నారు. వంగా గీతది పిఠాపురం అమ్మ గారి ఊరా నాన్న గారి ఊరా అని ప్రశ్నించారు. అసలు ఎవరు ఎక్కడ నుంచి అయినా పోటీ చేయవచ్చు అని రాజ్యాంగంలో ఉందని అన్నారు. జగన్ పులివెందుల నుంచి బయటకు వచ్చి కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పోటీ చేస్తే తమ సత్తా ఏమిటో చూపిస్తామని పంతం నానాజీ రాజకీయ పంతమే పూనారు. ఈ సందర్భంగా ఆయన ఆవేశంలో జగన్ మీద అనుచిత వ్యాఖ్యలే చేశారు.

**భగ్గుమన్న వైసీపీ :**

పంతం నానాజీ వ్యాఖ్యలతో వైసీపీ నేతలు అంతా భగ్గుమంటున్నారు. పంతం నానాజీ మీద 2024 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలు అయిన మాజీ మంత్రి కురసాల కన్నబాబు జగన్ వంటి నేత మీద మాజీ సీఎం మీద పంతం నానాజీ దారుణమైన కామెంట్స్ చేస్తున్నారు అని మండిపడ్డారు. జనసేన తమతో సవాల్ చేసే ముందు ఒంటరిగా పోటీకి దిగాలని ఆయన అన్నారు. పొత్తులతో వచ్చి గెలవడం కాదని ఎద్దేవా చేశారు. పదిహేనేళ్ల పాటు కూటమి పొత్తులో ఉంటామని జనసేన చెప్పడమే జగన్ అంటే భయం ఏంటో తెలియచేస్తోందని మళ్లీ సవాళ్ళు ఎందుకని ఆయన ప్రశ్నించారు.

**నా మరణం పిఠాపురం గడ్డ మీదనే :**

ఇక వంగా గీత అయితే భావోద్వేగంతో కూడిన వ్యాఖ్యలు చేశారు. తన పుట్టింటి వారు అంతా ఉండేది పిఠాపురంలోనే అని చెప్పారు. తనది నాలుగు దశాబ్దాల సుదీర్ఘమైన రాజకీయం అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ గా పనిచేశాను అని అలాగే ఎంపీగా ఎమ్మెల్యేగా నెగ్గిన తనను జగన్ పిలిచి కాకినాడ ఎంపీగా పోటీ చేయించారని గుర్తు చేసుకున్నారు. తన మరణం కూడా పిఠాపురంలోనే అని పిఠాపురంతో తన అనుబంధాన్ని ఎవరూ ప్రశ్నించజాలరని ఆమె ఎమోషనల్ గా కామెంట్స్ చేశారు. మొత్తం మీద చూస్తే పిఠాపురం చుట్టూ రాజకీయ కాక అంటుకుంది. మరి ఇది ఏ మలుపు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

## 10 సూత్రాల అమలు.. సీఎం చంద్రబాబు సమక్షంలో కీలక ఒప్పందం

ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన 'స్వర్ణాంధ్ర 2047 విజన్' అమలులో ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా నిర్దేశించిన పది సూత్రాలను సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రణాళికా విభాగం, కేఆర్ఈఏ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్ (ఐఎఫ్ఎంఆర్) మధ్య సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరిగింది. సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధి కపిల్ విశ్వనాథన్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో 15 శాతం వృద్ధిరేటును సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. 2014-19 మధ్య కాలంలో 13.5 శాతం సగటు వార్షిక వృద్ధి రేటును (సీఏజీఆర్) సాధించామని, అయితే గత ఐదేళ్లలో వివిధ కారణాల వల్ల అది 11 శాతానికి పరిమితమైందని విశ్లేషించారు. ఇప్పుడు నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ), వృద్ధిరేటు సాధనలో పది సూత్రాల మిషన్ సెల్స్‌ను ఏర్పాటు చేసి, వాటి పర్యవేక్షణ బాధ్యతలను ఐఎఫ్ఎంఆర్ చూస్తుంది. తొలిదశలో జీరో పావర్టీ (పేదరిక నిర్మూలన), వాటర్ సెక్యూరిటీ (జల భద్రత), డీప్ టెక్నాలజీ మిషన్లపై ఐఎఫ్ఎంఆర్ ప్రభుత్వంతో కలిసి పనిచేయనుంది. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, విధానపరమైన సూచనలు అందించడంతో పాటు, వినూత్న పద్ధతులను సిఫారసు చేస్తుంది. ఈ పది సూత్రాల అమలును పర్యవేక్షించేందుకు ప్రభుత్వం రాష్ట్రస్థాయి కమిటీతో పాటు, మిషన్ వర్కింగ్ గ్రూపులను కూడా ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలోని అన్ని రంగాల అభివృద్ధికి డీప్ టెక్‌ను అనుసంధానం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఏఐ స్కిల్లింగ్, డ్రోన్ మ్యాపింగ్, ఆటోమొబైల్, మెటల్స్, స్టీల్, సెమీ కండక్టర్స్, రక్షణ రంగాల్లో కీలక ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తున్నాయని గుర్తుచేశారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీలను సైతం రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కేఆర్ఈఏ, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధులు, ప్రణాళికా విభాగం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ మనదే

- మొదటి పేజీ తరువాయి

ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రజతోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అనుప్రియ పటేల్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 1.84 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ల (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) ద్వారా 30 ఏళ్లు దాటిన వారికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు 35 కోట్ల మందికి ఓరల్ క్యాన్సర్, 16 కోట్ల మంది మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, 9 కోట్ల మందికి సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పూర్తి చేశామని పేర్కొన్నారు. ముందస్తుగా వ్యాధిని గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చని, చికిత్సా భారాన్ని తగ్గించవచ్చని ఆమె అన్నారు. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన మౌలిక సదుపాయాలను భారీగా పెంచామని, 2014కు ముందు 384గా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్య ఇప్పుడు 820కి చేరిందని తెలిపారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కింద 62 కోట్ల మంది పేదలకు క్యాన్సర్ చికిత్సలో ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. జన్ ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరకే మందులు అందిస్తున్నామని గుర్తుచేశారు. నివారణ చర్యల్లో భాగంగా 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. స్వర్గీయ ఎన్టీ రామారావు దార్శనికతతో, బసవతారకం గారి స్ఫూర్తితో ఏర్పాటైన ఈ ఆసుపత్రి, గత 25 ఏళ్లుగా పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆసుపత్రి చేస్తున్న సేవలను కొనియాడారు. అమరావతిలో కొత్తగా ఏర్పాటు చేయబోయే ఆసుపత్రికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## బసవతారకం ఆసుపత్రి ఆ స్ఫూర్తితోనే పనిచేస్తోంది

బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సేవలు మహోన్నతమైనవని, స్వర్గీయ నందమూరి తారక రామారావు, బసవతారకం గార్ల స్ఫూర్తితో ఏర్పాటైన ఈ సంస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రశంసించారు. అయితే, మారుతున్న జీవనశైలి కారణంగా దేశవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి ఒక 'రాచపుండు'లా విస్తరిస్తోందని, దీనిని ఎదుర్కోవడానికి ఒక జాతీయ మిషన్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఒక కర్తవ్యంగా చేపట్టాలని ఆయన సూచించారు.

బసవతారకం ఆసుపత్రి రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్న వెంకయ్యనాయుడు తన ప్రసంగంలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. స్వర్గీయ ఎన్టీఆర్ తన భార్య బసవతారకం గారి కోరిక, ప్రేరణతో ఈ ఆసుపత్రిని స్థాపించి గొప్ప ఆశయానికి పునాది వేశారని, వారి స్మృతికి నివాళులర్పించారు. ప్రస్తుతం ఆసుపత్రి చైర్మన్‌గా నందమూరి బాలకృష్ణ, ఆయన కుమార్తె బ్రాహ్మణి నాయకత్వంలో ఆసుపత్రి మరింత ఉన్నతంగా సేవలందించడం అభినందనీయమని అన్నారు. ఈ సేవలను ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కూడా విస్తరించి, మరింత మందికి అందుబాటులోకి తేవాలని ఆయన ఆకాంక్షించారు.

**జీవనశైలి మార్పులే ప్రధాన కారణం**

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగానే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు పెరుగుతున్నాయని వెంకయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. "మన జీవితంలో, జీవన శైలిలో వస్తున్న మార్పుల కారణంగానే ఈ రాచపుండు విజృంభిస్తోంది. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. క్యాన్సర్ అనే పదం బదులు 'రాచపుండు' అనే స్వచ్ఛమైన తెలుగు పదాన్ని వాడటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అమెరికాలో ఉంటూ కూడా అద్భుతమైన తెలుగు భాషా పరిజ్ఞానంతో మాట్లాడిన మంత్రి చంద్రశేఖర్ గారిని చూసి ఎంతో మురిసిపోయానని అన్నారు.

**వైద్యం ఒక పవిత్రమైన మిషన్**

వైద్యం, విద్య అనేవి వ్యాపారాలుగా కాకుండా ఒక మిషనరీ స్ఫూర్తితో సాగాలని వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. బసవతారకం ఆసుపత్రిలోని వైద్య బృందం డాక్టర్ ప్రభాకర్ రావు, డాక్టర్ సోమసుందర్ రావు, డాక్టర్ కృష్ణయ్య వంటి వారు రోగులకు ప్రేమపూర్వకంగా, అంకితభావంతో సేవలు అందిస్తున్నారని, అందుకే ఆ ఆసుపత్రి విజయవంతంగా నడుస్తోందని కొనియాడారు. తాను కూడా అప్పుడప్పుడు తెలిసిన రోగుల కోసం ఆసుపత్రికి వెళ్తుంటానని గుర్తు చేసుకున్నారు.

**ఉచితాలపై కీలక వ్యాఖ్యలు.. ప్రభుత్వాలకు సూచనలు**

ప్రభుత్వాలు విచక్షణారహితంగా ఉచితాలు పంచడం తగదని, అవి అరుచితాలుగా మారతాయని వెంకయ్యనాయుడు పునరుద్ఘాటించారు. "నేను ఎప్పుడూ చెబుతుంటాను, ఉచితాలు వద్దయ్యా అవి అరుచితాలు అయిపోతాయి. కానీ విద్య, వైద్యం ఈ రెండింటినీ ఉచితంగా ఇవ్వండి. సామాన్య ప్రజలు ఎంతో లాభపడతారు" అని ఆయన స్పష్టం చేశారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వాలు ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అత్యాధునిక పరిజ్ఞానంతో వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు.

## లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి.. దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- మొదటి పేజీ తరువాయి

ఉన్న ఓ మూడు అంతస్తుల భవనంలోని కోచింగ్ సెంటర్‌లో చెలరేగిన మంటల కారణంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, పురానియాలోని ఓ వాణిజ్య భవనంలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే దట్టమైన పొగ భవనం మొత్తాన్ని చుట్టుముట్టడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనం పై అంతస్తుల నుంచి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారంతా 20 నుంచి 24 ఏళ్లలోపు వయసు వారేనని అధికారులు తెలిపారు. ఈ ప్రమాద వార్త తెలియగానే ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు, అలీగఢ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుని లక్నోకు తిరిగి వచ్చారు.

ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. భవనం గోడలను పగలగొట్టి లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## పవన్ కల్యాణ్ మాటలకు నా పీఏ కూడా స్పందించడు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ... పవన్ కల్యాణ్ హావభావాలు, ఆయన మాట్లాడుతున్న విధానంపై సోషల్ మీడియాలో విపరీతంగా మీమ్స్, ట్రోల్స్ వస్తున్నాయని ఎద్దేవా చేశారు. "ఈ శతాబ్దపు మోస్ట్ కామిక్ పర్సన్ పవన్ కల్యాణ్. ఆయన సినిమాల్లో కంటే నిజ జీవితంలోనే అత్యంత అద్భుతంగా నటిస్తున్నారు. పదిమందిలో మాట్లాడుతున్నామనే కనీస బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. ఆయన ఉప ముఖ్యమంత్రి కాకుండా ఉంటే, ప్రెస్ మీట్లో ఆయన మాటలకు నా పీఏ కూడా స్పందించడు. అసలు ఆయన వెంట ఒక సామాజిక వర్గం కళ్లు మూసుకుని ఎలా నడుస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత రాజకీయాలను ప్రస్తావిస్తూ... 2019 వరకు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, మరి దానిపై పవన్ కల్యాణ్ ఎందుకు నోరు మెదపరని శ్రవణ్ కుమార్ నిలదీశారు. ముఖ్యంగా సంచలనం రేపిన 'సుగాలి ప్రీతి' కేసును పవన్ డీల్ చేస్తున్న తీరుపై ఆయన లీగల్ పాయింట్స్ లేవనెత్తారు. "సుగాలి ప్రీతి అసలు ఏ సంవత్సరంలో చనిపోయిందో కూడా కనీస అవగాహన లేకుండా పవన్ మాట్లాడుతున్నారు. గతంలో ఈ కేసు విషయంలో 'భౌభౌ'మని అరిచిన పవన్.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మారుస్తున్నారు" అని మండిపడ్డారు. సుగాలి ప్రీతి కేసులో పోలీసులు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో అన్ని రకాల పక్కా ఆధారాలు ఉన్నాయని, కానీ పవన్ కల్యాణ్ మాత్రం ఆధారాలు లేవని అనడం వెనుక అసలు ఉద్దేశం ఏంటని శ్రవణ్ కుమార్ ప్రశ్నించారు. "కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలన్నీ కోర్టులో అత్యంత భద్రంగా ఉన్నాయి. అలాంటప్పుడు ఆధారాలు లేవంటూ నిందితులను కేసు నుంచి తప్పించాలని పవన్ చూస్తున్నారా?" అంటూ సూటిగా ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ అజ్ఞానాన్ని చూసి జనసేన నేతలు, కార్యకర్తలు తరించాలంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం.. ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!

- మొదటి పేజీ తరువాయి

నుంచే పెరిగిన ఒత్తిడి, నాయకత్వంపై అసంతృప్తి నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని చెప్పారు. "నేను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం తీసుకున్నాను" అని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పలు రంగాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. ఆర్థిక వృద్ధి, వేతనాల పెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల, కార్మికులు-అద్దెదారుల హక్కుల బలోపేతం వంటి అంశాలను ప్రస్తావించారు. రక్షణ వ్యయాన్ని పెంచడం, అక్రమ వలసలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం, చిన్నారుల పేదరికం తగ్గించే కార్యక్రమాలు అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రధాన విజయాలని పేర్కొన్నారు. అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. తరచూ నాయకత్వ మార్పులు చోటుచేసుకోవడం దేశ రాజకీయాల్లో నెలకొన్న అస్థిరతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా సేవలపై ఒత్తిడి, ఆర్థిక సవాళ్లు, అక్రమ వలసల వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు బ్రిటన్‌లో పెరుగుతున్నాయి.

## హైదరాబాదులో బసవవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం..

- మొదటి పేజీ తరువాయి

ఆసుపత్రిలో రోజుకు 35 నుంచి 40 సర్జరీలు జరుగుతున్నాయని, ఇప్పటివరకు 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించామని తెలిపారు. దేశంలోనే తొలి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాల్లో తమది ఒకటని గర్వంగా చెప్పారు.

భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోనూ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించనున్నట్లు బాలకృష్ణ ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రి సేవలను కూడా మరింత విస్తరిస్తామని వెల్లడించారు. ఈ వేడుకలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనరసింహ, ఏపీ మంత్రి సత్యకుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## కుట్రలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం.. అప్రమత్తంగా ఉండాలి

- మొదటి పేజీ తరువాయి

కింద వచ్చే అర్జీలను సానుభూతితో పరిశీలించాలన్నారు. "సమస్య పరిష్కారం కోసం తమ దగ్గరకు వచ్చే పౌరులతో అధికారులు, ఉద్యోగులు మర్యాదగా ప్రవర్తించాలి. వారి స్థానంలో మనమే ఉంటే ఎలా ఆలోచిస్తామో అలా ఆలోచించి సేవలు అందించాలి. ఇది పరిపాలనపై ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని పెంచుతుంది" అని ఆయన హితవు పలికారు.

ఉద్యోగుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తామని, పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని తేల్చిచెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారానే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమవుతుందని, మంత్రులు, అధికారులు, ఉద్యోగులు దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఫైళ్ల క్లియరెన్స్ సులభమైందని, అయితే వినూత్న ఆలోచనలు లేకపోతే వ్యవస్థలు నిస్సారంగా మారతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డబ్బులేక ఏ ఒక్కరూ క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు

- మొదటి పేజీ తరువాయి

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి సత్యకుమార్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. "నటుడిగా, ఎమ్మెల్యేగా కాదు.. ఓ కొడుకుగా మీ ముందు నిలుచున్నా. మా అమ్మ బసవతారకం క్యాన్సర్ బారిన పడినప్పుడు ఎంతో బాధపడ్డాం. డబ్బు ఉంది కాబట్టి గట్టిగా పోరాడగలిగాం. డబ్బు లేని వారు ఈ వ్యాధితో ఎలా పోరాడుతారని మా అమ్మ ప్రశ్నించారు. అప్పుడే ఈ ట్రస్ట్ ఏర్పాటు ఆలోచన వచ్చింది. 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించాం. బాధతో ఆసుపత్రికి వచ్చే వారు నవ్వుతూ తిరిగి వెళ్లాలి అనేదే మా ఉద్దేశం. భారత్‌లోనే మొట్టమొదటి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రం అప్పట్లో ప్రారంభించాం.

ప్రభుత్వాలు మాకు ఎంతగానో సహకరించాయి. ఎన్నో సంస్థలు, ఎందరో దాతలు ఈ ప్రయాణంలో మాకు అండగా నిలిచారు. ఏ ఒక్క రోగి కూడా డబ్బు లేక క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు. 25 ఏళ్ల క్రితం చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నాం.. భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తాం. హైదరాబాద్‌లో సేవలు మరింత విస్తరిస్తాం" అని బాలకృష్ణ అన్నారు.

## టెకీ రాధా గాయత్రి కేసులో కీలక పరిణామం.. విచారణాధికారి మార్పు

- మొదటి పేజీ తరువాయి

అనంతరం ఆ బాధ్యతను సంపూర్ణానంద్ గైరోలాకు అప్పగించారు. అల్లుడు శ్రీచరణ్‌పై అనుమానాలతో సుధాకర్ మసూరీ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో శ్రీచరణ్‌పై హత్య కేసు నమోదైంది.

## స్థానికుల కోరిక మేరకు నచ్చిన దేవుడి మందిరాలు

- మొదటి పేజీ తరువాయి

పవిత్ర స్థలాలు సామన్యులకు అందుబాటులో ఉంచే చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రతి ఇంటికీ ఆధ్యాత్మికత చేర్చాలన్న సీఎం ఆదేశాలతో పని చేస్తున్నాం. రెండేళ్లుగా హిందువుల ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక విలువలు కాపాడుతున్నాం. ఆరు వేలకు పైగా ఆలయాల పునర్నిర్మాణానికి రూ.813 కోట్లు వెచ్చించాం. ధార్మిక పరిషత్ ద్వారా శ్రీవాణి నిధులతో 1200కు పైగా భజన మందిరాలు నిర్మించాం. స్థానిక ప్రజల కోరిక మేరకు నచ్చిన దేవుడి మందిరాలు నిర్మిస్తాం. దేవాదాయ భూ రికార్డులను డిజిటలైజ్ చేసి పరిరక్షణ బాధ్యతలు చేపట్టాం. రానున్న రోజుల్లో 65 ఆలయాల్లో అన్నప్రసాదానికి చర్యలు తీసుకుంటున్నాం. అన్నప్రసాదం కోసం ఏటా దేవాదాయశాఖ రూ.84 కోట్లు ఖర్చు చేస్తోంది." అని మంత్రి ఆనం వివరించారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

## సర్ పై బూత్ లెవెల్ ఏజెంట్‌లు

# అవగాహన కలిగి ఉండాలి..

### అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి..

### ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్






**పుల్లల చెరువు పెన్ పవర్ జూన్ 22**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పూర్తి అవగాహన కలిగి ఉండాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో చొరవ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పుల్లల చెరువు మండల కేంద్రంలోని చిన్న రైస్ మిల్లులో సోమవారం నిర్వహించిన బీఎల్ఏల అవగాహన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల కన్వీనర్ దోమకాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఓటర్ల జాబితాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి బూత్‌కు బీఎల్ఏలే కీలకమని పేర్కొంటూ, గ్రామాలు, వార్డుల స్థాయిలో ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి ఓటరు జాబితాలో నమోదు చేయించే బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రత్యేకించి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతను ఓటరుగా నమోదు చేయించడంపై దృష్టి సారించాలని కోరారు. ఓటర్ల జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఉన్న తప్పులను గుర్తించి సకాలంలో సవరణలు చేపట్టాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు అనవసరంగా తొలగించబడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల్లో ఎన్నికల పట్ల చైతన్యం పెంపొందించడంతో పాటు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా బీఎల్ఏలపై ఉందన్నారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వమే ఎన్నికల నిర్వహణకు పునాది వంటిదని, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటు విలువైనదని ఆయన వివరించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే బీఎల్ఏలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సందేహాలను నివృత్తి చేస్తూ ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పతి రామచంద్ర, యర్రగొండపాలెం నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్ల అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారెడ్డి, వైసీపీ రాష్ట్ర పంచాయితీ రాజ్ వైస్ ప్రెసిడెంట్ భూమి రెడ్డి సుబ్బారెడ్డి, వైసీపీ ప్రకాశం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కోర్లకుంట జానకీ రఘు, పుల్లల చెరువు వైస్ ఎంపీపీ లింగంగుంట్ల రాములు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఆవుల కోటి రెడ్డి, మల్లపాళెం మాజీ సర్పంచ్ రమణ రెడ్డీ, చరణ్ రెడ్డి, మండల వైసీపీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో

# చిన్నారికి రూ.4.5 లక్షల వైద్యసాయం

### -సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం -ఊరట పొందిన పేద కుటుంబం



**కందుకూరు, పెన్ పవర్ జూన్ 22:**

లింగసముద్రం మండలానికి చెందిన ఓ పేద కుటుంబంలో జన్మించిన చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చొరవ చూపి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఎల్‌ఓసి ద్వారా రూ. 4. 5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. లింగసముద్రం మండలం రాచెరువు రాజుపాలెం (ఆర్.ఆర్.పాలెం) గ్రామానికి చెందిన దండే మాధవ, విజయ దంపతులకు పాప నెలలు నిండకముందే ఏడో నెలలో జన్మించింది. తక్కువ బరువుతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో చిన్నారిని విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. అయితే చికిత్స ఖర్చులు రోజురోజుకు పెరుగుతుండటంతో ఆర్థికంగా వెనుకబడిన ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. చిన్నారి తల్లి గృహిణి కాగా, తండ్రి మాలకొండ దేవస్థానంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. వైద్య ఖర్చులను భరించలేని పరిస్థితిలో ఉన్న కుటుంబ సభ్యులు తమ సమస్యను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 4. 5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టారు. దీంతో చిన్నారి చికిత్సకు అవసరమైన ఆర్థిక భారం కొంతవరకు తగ్గి కుటుంబానికి ఊరట లభించింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న పేద ప్రజలకు అండగా నిలుస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో ఎమ్మెల్యే ఎల్లప్పుడూ ముందుంటారని స్థానికులు అభినందించారు. చిన్నారి త్వరగా కోలుకుని ఆరోగ్యంగా జీవించాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

# గ్రానైట్ లారీ భీభత్సం..

## దశదిన కర్మకు వెళ్తున్న ముగ్గురి బలి

### కామేపల్లి హైవే రోడ్డుపై ఘటన

### మృతులు శావల్యాపురం మండలం వేల్పూరు వాసులుగా గుర్తింపు

### మరో ఆరుగురికి తీవ్ర గాయాలు







**పెన్ పవర్, సంతమాగులూరు, జూన్ 22**

దశదిన కర్మకు ఆటోలో వెళ్తున్న ప్రయాణికులను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం కామేపల్లి సమీపంలో సోమవారం గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న ఖాళీ లారీ ఆటోను ఢీకొట్టడంతో ఈ విషాద సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన 9 మంది నాదెండ్ల మండలం సంకురాత్రిపాడులో జరగనున్న దశదిన కర్మకు ఆటోలో బయలుదేరారు. కామేపల్లి వద్ద ఉన్న రైల్వే అండర్‌పాస్ సమీపానికి చేరుకోగానే ఓ గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి హైవేపైకి వస్తున్న అశోక్ లేయలాండ్ లారీ మలుపు తిరుగుతూ ఎదురుగా వచ్చిన ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దావులూరి ఏడుకొండలు (55), ముంద్రు రమణమ్మ (55) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో ఏడుగురిని నరసరావుపేట, వినుకొండ ఆసుపత్రులకు తరలించగా, చికిత్స పొందుతూ ఎలవర్తి సుబ్బాయమ్మ (70) ప్రాణాలు విడిచారు. దీంతో మృతుల సంఖ్య మూడుకు చేరింది. గాయపడిన వారిలో గుత్తా సుబ్బాయమ్మ, ముంద్రు వెంకటరామయ్య, ముంద్రు సుబ్బాయమ్మ, బోయపాటి లక్ష్మీదేవి, బోయపాటి అనూరాధ, కుంకలగుంట మీరావలి, డోమా చిన్న యోగమ్మ ఉన్నారు. లారీ ఢీకొన్న వేగానికి ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించి, ఆటోలో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి ఆసుపత్రులకు తరలించారు. సంతమాగులూరు సర్కిల్ సీఐ పి. శేషగిరిరావు పర్యవేక్షణలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు మరణించడంతో వేల్పూరు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## పెండింగ్ కేసుల పరిష్కారం కోసం

# దర్యాప్తును వేగవంతం చేయాలి

### అసాంఘిక కార్యక్రమాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాలి

### దర్శి సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించిన ప్రకాశం జిల్లా ఎస్పీ




**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 22**

పెండింగ్ లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వి.హర్ష వర్ధన్ రాజు ఆదేశించారు. దర్శి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరుపై, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు,ఎన్ బి డబ్ల్యూ స్, డిపిఓ పెండింగ్ రిప్లయ్స్ పై జిల్లా ఎస్పీ సోమవారం దర్శి పోలీస్ స్టేషన్ లో డిఎస్పీ, సీఐలు, ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి, కేసుల ఛేదింపునకు, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెళుకువలను అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. పోలీస్ స్టేషన్ల వారీగా యూఐ కేసులు తగ్గించుకోవాలని, వీలైనంత త్వరగా పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలని, అరెస్టులు, చార్జ్ షీట్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్ లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకోని ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని, చట్టవ్యతిరేక/అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచి కట్టడి చెయ్యాలన్నారు. అలాగే గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి కేసుల నమోదులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పేకాట, కోడి పందాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ప్రజా ప్రశాంతతకు భంగం కలిగించే అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, వారిని బైండ్ ఓవర్ చేయాలనీ, బైండవర్ ఉల్లఘించిన వారిపై తగ్గు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అలాగే ప్రతి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా మహిళా/పిల్లలు భద్రత, సైబర్ నేరాలు,రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నియమాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, చట్టాలు, శిక్షలపై అవగాహన వంటి అంశాలపై ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రకాశం, మార్కాపురం రెండు జిల్లాల వ్యాప్తంగా 220 కుంభాకార దర్పణాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో బ్లాక్ స్పాట్లు, ప్రమాదంలో జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో కుంభాకార దర్పణం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సర్వీస్ రోడ్డు నుండి జాతీయ రహదారిపై ప్రవేశించే సమయంలో తప్పనిసరిగా వాహనాన్ని ఆపి, ఇరువైపులా పరిశీలించి తర్వాత మాత్రమే ముందుకు సాగాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు డ్రైవ్ చేసే వారు సీట్ బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదమని, ఇది మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు కలిగిస్తుందని హెచ్చరించారు. ప్రజలు మరియు వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే ప్రదేశాలను గుర్తించి ప్రజల, మునిసిపల్ కార్మికుల వారి సహకారంతో వాటిని శుభ్రం చేయించటం జరిగిందని, అలా చేయటం ద్వారా న్యూసెన్స్ తగ్గి శారీరిక నేరాలు తగ్గాయన్నారు. గతంలో కంటే ప్రస్తుతం నేరాలు తగ్గుముఖం పట్టిందన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే... అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దర్శి డిఎస్పీ బాలమురళి కృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బిసిఐ దేవ ప్రభాకర్, దర్శి సీఐ రామారావు,అద్దంకి అర్బన్ సీఐ సుబ్బరాజు, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు,చీమకుర్తి

# నియోజకవర్గంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

### మండల అభివృద్ధి అధికారులతో సమీక్ష ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 22**

గిద్దలూరు ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల మండల అభివృద్ధి అధికారులతో లతో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నీటి వనరుల స్థితిగతులు, బోర్‌వెల్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్‌ల నిర్వహణపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఎక్కడైనా నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసే విధంగా కార్యాచరణ సిద్ధం చేసి ప్రజలకు నీటిపై ఎటువంటి ఇబ్బందులున్నా వెంటనే పరిష్కారం చేయాల న్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికా రులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి సమస్య లను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామ సచివాలయాలు సందర్శించి సిబ్బంది పనితీరు మెరుగు పడేలా చూడాలిని ఎంపిడిఓ అని ఎమ్మెల్యే సూచనలు చేశారు. ఈ సమావేశంలో 6 మండలాల ఎంపిడిఓ లు పాల్గొని మండలాల వారీగా తాగునీటి సరఫరా పరిస్థితులను ఎమ్మెల్యే కు వివరించారు. ఎమ్మెల్యే అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు తెలిపారు.

# మహదేవపురం పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

### -దాత ఓవి రమణయ్య సేవలను అభినందించిన విద్యాశాఖ అధికారులు




**కందుకూరు, పెన్ పవర్ జూన్ 22**

మండలంలోని మహదేవపురం గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సంబంధిత స్టేషనరీ సామగ్రిని దాత, యూటీఎఫ్ సీనియర్ కామ్రేడ్ ఓవి రమణయ్య పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా పుస్తకాలు, పెన్నులు తదితర విద్యా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ డిప్యూటీ విద్యాశాఖాధికారి (డీవైఈఓ) ఎం.ఎస్. రాంబాబు, కందుకూరు మండల విద్యాశాఖ అధికారులు ఎం.ఎన్.కే. శర్మ, కె. సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఓవి రమణయ్యను అభినందిస్తూ, మండలంలోని ఉపాధ్యాయులందరూ తమ స్వగ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యా సామగ్రి, అవసరమైన సహాయ సహకారాలు అందించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. దాత ఓవి రమణయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి భావి భారత పౌరులుగా ఎదగాలని, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రమణయ్య కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి ఓవి రమణయ్యను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా తమిళ నాడు ముఖ్యమంత్రి విజయ్ జన్మదిన వేడుకలు



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూన్ 22**

తమిళనాడు సీఎం దళపతి విజయ్ జన్మదిన వేడుకలు స్థానిక ఒంగోలు ట్రంకు రోడ్ లోని లక్ష్మీ డయాగ్నస్టిక్ అధినేత దళపతి విజయ్ అభిమాని డాక్టర్ నావూరి రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకర్ రెడ్డి, కొండేపి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీపతి సతీష్ హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి దళపతి విజయ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు నిజమైన వారసుడు విజయ్ అని ఆయన ముఖ్యమంత్రి కావడంలో కాంగ్రెస్ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ దా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విజయ్ సినీ, రాజకీయరంగంలో అగ్రస్థానం రావడం అరుదని ఆ ఘనత విజయ్ కే దక్కుతుందని అన్నారు. కొండేపి నియోజకవర్గ ఇన్చార్జి శ్రీపతి సతీష్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు వద్దండి మల్లికార్జునరావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దాసరి రవి, రాష్ట్ర ఎస్ టి సెల్ కోఆర్డినేటర్ రాజారావు, జిల్లా ఎస్సీ ఎస్టీ రిపోర్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి ఏసుపోగు కోటయ్య, డాక్టర్ శ్రీపతి సురేష్, కొండేపి నియోజకవర్గ నాయకులు బడుగు శశికుమార్, గంగుల పోలయ్య, మల్లికార్జున రావు, జాకబ్, యూత్ కాంగ్రెస్ నాయకులు సునీల్ వర్మ, మోహన్, ప్రజాశక్తి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# జెల్లివారి పుల్లల చెరువులో అనధికారిక బెల్ట్ షాపులు తొలగించాలి

### గిద్దలూరు ఎక్సైజ్ అపోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 22**

రాచర్ల మండలం జెల్లివారి పుల్లల చెరువు గ్రామంలో నివాస ప్రాంతాల మధ్య అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలని కోరుతూ గిద్దలూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో గ్రామ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ సిద్ధం నరసింహులు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేకల తిరుపాల్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మోపర్తి జయరావు, సబ్ ఇన్స్పెక్టర్ కె. విక్టర్ జాన్సన్ ను కలిసి ఈ మేరకు ఒక ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. గ్రామంలో శాంతిభద్రతలను కాపాడాలని, అక్రమ మద్యం విక్రయదారులపై, వారికి సహకరిస్తున్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు ఎక్సైజ్ అధికారులను కోరారు. దీనిపై స్పందించిన ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో తనిఖీలు చేపట్టి అక్రమ బెల్ట్ షాపులను శాశ్వతంగా మూసివేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అనధికార మద్యవిక్రేతల అరెస్ట్

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 22**

బహిరంగ ప్రదేశములలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న 26 మంది పై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. సదరు వ్యక్తులు వద్ద నుండి 36.36 లీటర్ల ఐఎంఎల్ లిక్కర్ ను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 60 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఎక్సైజ్ శాఖ స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన క్రమంలో అక్రమ మద్యం విక్రేతలను, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మద్యం అనధికార విక్రయాలు చేసిన బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

# దర్శిలో ప్రత్యేక 'పోలీస్ మీకోసం' కార్యక్రమం

### - ఫిర్యాదులు స్వీకరించిన ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

### - ఒంగోలు మీ కోసం కార్యక్రమంలో 69 ఫిర్యాదులు

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 22**

ప్రజా ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించడం, పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, పోలీస్ అధికారులు సోమవారం దర్శి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శి పట్టణం, చుట్టూ పక్కల ప్రాంతాల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను ఎస్పీ స్వీకరించి, తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడిన ఎస్పీ వారి సమస్యల పూర్వాపరాలను సమగ్రంగా తెలుసుకుని, వాటిని చట్టపరంగా పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అనంతరం ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మీ కోసం' కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన న్యాయం అందించాలన్నారు. ఫిర్యాదులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కావున ఆ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై కూడా నివేదిక ఇవ్వవలసిందిగా పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పోలీసు వ్యవస్థను ప్రజలకు మమేకం చేయడంలో భాగంగా ఈ ప్రత్యేక మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, దర్శి పట్టణం పరిసర ప్రాంతాల ప్రజలు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు వారి సమస్యల పరిష్కారం కోసం దూర



ప్రాంతాల నుండి వ్యయప్రయాసలు పడి ఒంగోలులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి రాకుండా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ప్రతి సోమవారం ఆల్టర్నేట్ గా అన్ని సబ్ డివిజన్ పరిధిలో మీకోసం కార్యక్రమం నిర్వహిస్తామని, అదే విధంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో కూడా యథావిధిగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మీకోసం ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తి స్థాయి విచారణ జరిపి సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ పోలీస్




శాఖ అందుబాటులో ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక మీకోసం కార్యక్రమంలో కుటుంబ కలహాలు, చీటింగ్, భర్త/అత్తారింటి వేదింపులు, భూ.. ఆస్థి వివాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందాయి. అదే విధంగా ఈ రోజు ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, సింగరాయకొండ సిఐ శ్రీహరి నిర్వహించిన మీకోసం కార్యక్రమంకు 65 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో దర్శి డిఎస్పీ బాలమురళి కృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, దర్శి సీఐ రామారావు,అద్దంకి అర్బన్ సీఐ సుబ్బరాజు, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు,చీమకుర్తి సీఐ ప్రసాద్ సబ్ డివిజన్ ఎస్సైలు పాల్గొన్నారు.

# గంజాయి రహిత కందుకూరు కోసం ప్రజలు సహకరించాలి

### -సమాచారం అందిస్తే గోప్యతకు హామీ -సీఐ షేక్ అన్వర్ బాషా




**కందుకూరు, పెన్ పవర్ జూన్ 22**

కందుకూరు పట్టణాన్ని గంజాయి రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, ముఖ్యంగా యువత సహకరించాలని కందుకూరు సీఐ షేక్ అన్వర్ బాషా పిలుపునిచ్చారు. పట్టణంలోని జనార్ధన కాలనీ పుట్ట వద్ద స్థానిక ప్రజలు, యువతతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి వినియోగం వల్ల వ్యక్తులు శారీరకంగా, మానసికంగా తీవ్ర నష్టాలకు గురవుతారని తెలిపారు. గంజాయి మత్తులో వ్యక్తులు తమ చర్యలపై నియంత్రణ కోల్పోయి నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గంజాయి ప్రభావం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా లేదా వినియోగిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. గంజాయి రవాణా, విక్రయం లేదా వినియోగంలో పాల్గొనే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ప్రజలు కందుకూరు సీఐ 9121102202, కందుకూరు టౌన్ ఎస్సై 9121102203, కందుకూరు రూరల్ ఎస్సై 9121102204, అత్యవసర సేవల నంబర్ 112 లేదా ఈగల్ టీమ్ హెల్ప్‌లైన్ 1972కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు టౌన్ ఎస్సై పులి శివ నాగరాజు, కందుకూరు రూరల్ ఎస్సై బాలకృష్ణ పాల్గొన్నారు. గంజాయి నిర్మూలనకు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను స్థానికులు అభినందించారు.

# పి ఎమ్ సూర్యఘర్ సద్వినియోగం చేసుకోండి

### గిద్దలూరు నియోజకవర్గం బిజెపి బిఎల్ఎ-1 డాక్టర్ నగేష్



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 22**

పీఎం సూర్యఘర్ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని గిద్దలూరు నియోజకవర్గం బిఎల్ఎ-1 ఆకుల నగేష్ అన్నారు సోమవారం రాచర్ల హరిజనవాడలో ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు సోలార్ ప్లాంట్ వల్ల విద్యుత్ ఆదా అవుతుందని, విద్యుత్ కూడా సమృద్ధిగా అందుతుందని అన్నారు సోలార్ వల్ల అధిక ప్రయోజనాలు కలుగుతాయని ప్రజలు దీనిపై అవగాహన కల్పించుకోవాలన్నారు ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా బీసీ ఓసీలకు 45 శాతం సబ్సిడీతో కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల అధ్యక్షులు దూదేకుల మహేష్ గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ గిద్దలూ రూరల్ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి కంభం మండల అధ్యక్షులు బాదం కిషోర్ గుమ్మ రాముడు గిద్దలూరు బిజెపి నాయకులు అర్ధవీడు మండల అధ్యక్షులు వీరయ్య యాదవ్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

### -శ్రీ రామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సేవలను అభినందించిన ఎంఈవో సుబ్బారెడ్డి

**కందుకూరు, పెన్ పవర్ జూన్ 22**

"చేయి చేయి కలుపుదాం.. ఆపదలో ఉన్న వారిని ఆదుకుందాం" అనే నినాదంతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీ రామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కందుకూరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) సుబ్బారెడ్డి మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా శ్రీ రామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తూ విద్యాభివృద్ధికి విశేషంగా తోడ్పడుతోందని కొనియాడారు. విద్యార్థుల సంక్షేమంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలను కూడా సంస్థ చేపడుతోందని ప్రశంసించారు. ప్రభుత్వం కూడా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, బ్యాగులు తదితర సౌకర్యాలను కల్పిస్తోందని, వాటికి తోడు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు.



ఈ సందర్భంగా శ్రీ రామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సేవారత్న రవ్వా శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తమ సంస్థ భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఈసీ సభ్యులు కొణిజేటి అనిల్ కుమార్, మోదడుగు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కృష్ణమోహన్, సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు స్థానికులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేయడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రి సభ ప్రాంగణాన్ని పరిశీలోలించిన సీఎం ఓ ఫ్రోగ్రామ్ కోఆర్డినేటర్



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 22**

గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె గ్రామంలో ఈ నెల 27 న నిర్వహించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభా ప్రాంగణాన్ని సీఎం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ సునీత , జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు , జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఆర్డీవో ఎం. వెంకట శివరామ్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సభా వేదిక నిర్మాణం, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, పార్కింగ్, తాగునీటి వసతి, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సభా ప్రాంగణంలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల రాకపోకలకు అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు భద్రతా ప్రమాణాలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. సభా ఏర్పాట్ల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి , నిర్ణీత గడువులో అన్ని పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# సరివీ రెడ్డి పల్లె గ్రామానికి నాలుగు రోజులపాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

### ఈనెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు సరఫరా నిలిపివేత



**కొమరోలు పెన్ పవర్ జూన్ 22**



కొమరోలు సబ్‌స్టేషన్ పరిధిలోని సరివి రెడ్డి పల్లె గ్రామానికి ఈనెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ప్రతిరోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆర్ డి ఎస్ ఎస్ పథకం ద్వారా మండలంలో అమలు జరుగుతున్న కొత్త లైన్ల ఏర్పాటులో భాగంగా సరివీ రెడ్డి పల్లె గ్రామంలో కొత్త లైన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆ కార్యక్రమం ఆ గ్రామంలో నాలుగు రోజులపాటు చేపట్టవలసి ఉన్నదని, ఆ కారణంగా ఈనెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయవలసి వస్తున్నదని ఆయన చెప్పారు. కావున ఆ గ్రామానికి చెందిన విద్యుత్ వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

# 24 నుండి నారసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు

**ధ్వజారోహణం రోజున గరుడ ప్రసాదం వితరణ -ఆధ్యాత్మిక శోభ ఉట్టి పడేవిధంగా భక్తులకు సౌకర్యం**

**బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యేందుకు భక్తులు సహకరించాలి.**

**ధర్మకర్తల మండలి చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, ఇ ఒ కృష్ణ వేణి పిలుపు**





**సింగరాయకొండ, జరుగుమల్లి జూన్ 22, పెన్ పవర్**

యోగానంద లక్ష్మి నారసింహ స్వామి అనుగ్రహం తో దక్షిణ సింహాచలం గా ప్రసిద్ధి చెందిన వరాహ లక్ష్మి నారసింహ క్షేత్రం లో ఈ నెల 24 తేదీ నుండి జూలై 4 వ తేదీ వరకు జరుగ నున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక,భక్తుల ప్రాధాన్యంగా విజయ వంతంగా నిర్వహించేందుకు ధర్మ కర్తల మండలి, దేవాదాయ ధర్మాదాయ శాఖ చర్యలు చేపట్టిందని చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు వివరించారు. సోమవారం నరసింహ క్షేత్రం ధర్మ కర్తల మండలి చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి తమ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు నిర్వహణ గురించి వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు వివరిస్తూ ఈ నెల 24 నుండి జూలై 4 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సౌకర్యం కొరకు అవసరమైన వసతులు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ క్షేత్రం లో బ్రహ్మోత్సవాల అంకురార్పణ మరుసటి రోజు 25 వ తేదీ ఉదయం 9 గంటలకు గరుడ ధ్వజారోహణ ఉంటుందని వివరించారు. ధ్వజారోహణ సందర్భంగా ధ్వజ స్తంభం వద్ద విశేష పూజ అనంతరం వితరణ చేసే గరుడ ప్రసాదం స్వీకరించిన సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం అన్నారు. అంతటి విశిష్టత ఉన్న ఈ కార్యక్రమం లో స్వయంగా పాల్గొని స్వామి వారి గరుడ ప్రసాదం పొందాలని వారు భక్తులను కోరారు. అదే విధంగా నిత్య కైకర్యాలు ప్రత్యేక కార్యక్రమాలు, ఉత్సవాలు, వాహన సేవలు,సాంస్కృతిక కార్యక్రమాలు, బండలగుడు పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేకించి హనుమంతు వాహన సేవ, గరుడ సేవ, స్వామి వారి కల్యాణోత్సవం, స్వామి వారి రథోత్సవం ప్రధానం అన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యేందుకు భక్తులు ధర్మ కర్తల మండలి కి, దేవాదాయ ధర్మాదాయ శాఖ కి సహకరించాలన్నారు. కొండ మీద, కొండ కింద ఎక్కడ భక్తులకు ఇబ్బందులు ఎదురు కాకుండా పోలీస్ బందోబస్తు, రక్షణ ఏర్పాట్లు, వైద్య ఆరోగ్య సౌకర్యం ప్రత్యేక వైద్య శిబిరాలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఎక్కడ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వాతావరణానికి ఇబ్బంది కలుగకుండ భక్తులు సహజరించాలని వారు కోరారు.

## యుటిఎఫ్ సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయుల నుంచి విశేష స్పందన



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 22**

మండలంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం విజయవంతమైనట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు కందెర నాగరాజు, ప్రధాన కార్యదర్శి కుండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయుల నుంచి విశేష స్పందన లభించిందని అన్నారు ఉపాధ్యా యుల హక్కుల పరిరక్షణ, సేవా సమస్యల పరిష్కారం, విద్యా రంగ అభివృద్ధి కోసం యూటీఎఫ్ నిరంతరం రాజీలేని పోరాటం చేస్తోందని, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నందున యూటీఎఫ్ పట్ల ఉపాధ్యాయుల్లో విశ్వాసం పెరిగిందని తెలిపారు.అందువల్లే మండలంలోని అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు చేసుకుని సంఘానికి మద్దతు ప్రకటించినట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం మరింత బలోపేతంగా ఉద్యమిస్తుందని, విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జి లక్ష్మీనారాయణ, నారిశెట్టి వెంకటరామయ్య, గోదాసు వేమనారాయణ, జె వెంకట్రావు, షేక్ పాదుషా, వి సాంబశివరావు, ఇర్ల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలి

**కృషి విజ్ఞాన్ శాస్త్రవేత్త వెంకటేశ్వర రెడ్డి**



**పొదిలి, పెన్ పవర్, జూన్ 22**

రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. సోమవారం నాడు మండలంలోని తలమల్ల, ఉప్పలపాడు గ్రామాల్లో రైతన్న,-మీకోసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్త వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ రైతులు రసాయనక ఎరువులు, నువ్వు మందులు వాడే విధానం గురించి వివరించారు. రైతులు సాగుపడు ఖర్చులను తగ్గించుకొని, తద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. వర్షాల వల్ల రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్త చదల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చేవూరు దళితుల భూములకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

**ధర్నాలో నినదించిన దళితులు -తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత**





**గుడ్లూరు, పెన్ పవర్, జూన్ 22:**

రామాయపట్నం పోర్టు, రోడ్డు నిర్మాణం కోసం చేవూరు దళితుల దగ్గర తీసుకున్న భూములకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని, సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో గుడ్లూరులో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు రోడ్డు నిర్మాణం కోసం, చేవూరు దళితుల దగ్గర, సర్వే నెంబరు 553లో 13.40 భూములను తీసుకున్నారని, కానీ ఇంతవరకు భూమికి నష్టపరహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా కనికరం లేదని, దళితులు గత 50 సంవత్సరాల నుండి ఆ భూమి ఆధారంగానే జీవనం సాగిస్తున్నారని, భూమిని , బలవంతంగా లాక్కోవడం వల్ల దళితులు వీధిన పడ్డారని, వెంటనే ప్రభుత్వం, పోర్ట్ అధికారులు, జోక్యం చేసుకొని భూమికి నష్టపరహారం చెల్లించాలని, లేకుంటే పోర్టు కార్యాలయాన్ని దిగ్బంధనం చేస్తామని ఆయన హెచ్చరిక చేశారు. అనంతరం తహశీల్దార్ బాలకిషోర్ కు వినతి పత్రం అందజేశారు. తహసిల్దార్ బాలకిషోర్ మాట్లాడుతూ మంగళవారం దళితుల భూములను పరిశీలించి తగు న్యాయం చేస్తానని దళితులకు హామీ ఇవ్వడం జరిగిందని జీ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కొట్టే వెంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.సుభాన్, రైతు సంఘం నాయకులు దామా కృష్ణయ్య, దళితులు చేవూరు ఇసాక్, లేళ్లపల్లి అంకయ్య, చేవూరి బ్రహ్మయ్య, రమణమ్మ, ఏసోబు, గగ్గయ్య, న ల్లయ్య చిన్నమ్మ, గోచిపోతల సంపత్, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరినీ భాగస్వామిని చేయండి

**కార్యకర్తలకు ఎమ్మెల్యే ముత్తుముల పిలుపు**




**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 22**

గిద్దలూరు నియోజకవర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఓటరు జాబితా విశ్లేషణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండల స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలకు ఓటరు జాబితా సవరణ, పరిశీలన ప్రక్రియలో పాటించాల్సిన విధి విధానాలపై సవివరంగా అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు, లోపాలు లేకుండా ప్రతి అర్హులైన ఓటరు పేరు నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు.అలాగే పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను చేరవేసి పార్టీపై మరింత విశ్వాసాన్ని పెంపొందించేలా కృషి చేయాలని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల లో పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు , పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సిపిఐ నూతన భవన శంకుస్థాపనకు ఆహ్వానం

**బొబ్బూరి రమేష్ ను కలిసిన సిపిఐ నాయకులు**






**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 22**

మార్కాపురం నూతన జిల్లా ఏర్పాటైన సందర్భంగా దివంగత నాయకుడు పూల సుబ్బయ్య వర్ధంతి సందర్భంగా ఈ నెల 23న మార్కాపురంలో సీపీఐ పార్టీ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మండల టిడిపి పార్టీ కార్యాలయంలో మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ ను మరియు సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి ని సీపీఐ మండల కార్యదర్శి షేక్ ఎర్రబెల్లి పెద్ద మస్తాన్ తో పాటు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన పూల సుబ్బయ్య సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాల స్ఫూర్తితో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు నూతన కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## ఘనంగా ప్రారంభమైన 'రైతన్నా మీకోసం' కార్యక్రమం

**ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేత**







**గుడ్లూరు, పెన్ పవర్, జూన్ 22**


మండల కేంద్రమైన గుడ్లూరు నందు రైతన్న మీకోసం కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి గుడ్లూరు బి.రవికుమార్ అధ్యక్షతన సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలను సందర్శించి రైతన్న మీకోసం కరపత్రాలను అందజేసి, కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యాన్ని గురించి గృహాలవారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఈ నెలలో 22 నుండి 27 వరకు మండలం నందలి అన్నీ రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాలయందు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు అనగా గ్రామ వ్యవసాయ, ఉద్యాన అధికారి, ఏ.హెచ్.ఏ, వీ.ఎఫ్.ఏ,వీ.ఆర్.ఓ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, పీ.ఏ.సీ.ఎస్, డబ్ల్యూ..యూ.ఏ, మార్కెట్ కమిటి, సీ.ఆర్.పీ మరియు ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది బృందములుగా ప్రతి కుటుంబాన్ని సందర్శించి కార్యక్రమాన్ని గురించి అవగాహన కల్పించేదరన్నారు. ప్రతి టీం రోజుకి 30 క్లస్టర్లు అనగా 90 కుటుంబాలను సందర్శించి క్రొత్తగా వొచ్చిన ఎఫైమ్స్ 2.ా ద్వారా యూరియా మరియు డీ.ఏ.పీ విక్రయం, ఎల్.ని.నో హెచ్చరికలు అనగా ధీర్ఘకాలిక పొడి వాతావరణ పరిస్థితులు దానికి అనుగుణంగా పంట సరళి, పంట మళ్లింపు అధిక నీటి వినియోగ పంటలకు బదులుగా పప్పుధాన్యాల సాగు, పప్పు ధాన్యాలను పండిద్దాం నెల సారాన్ని రక్షిద్దాం వంటి విషయాలపై అవగాహన కల్పిస్తారని అన్నారు. కాబట్టి మండలమునందలి రైతు సోదరులు అందరూ సద్వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారి రవికుమార్ మనవి చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్, ఎంపీడీఓ, గుడ్లూరు -1 ౘ2 గ్రామ వ్యవసాయ సహాయకులు, ఏ.పీ.సీ.ఎన్.ఎఫ్ సిబ్బంది, మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ ఆంజనేయస్వామి ధ్వజస్తంభం ప్రతిష్ఠ

**ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే అన్నా**

**మార్కాపురం పెన్ పవర్ జూన్ 22**

తర్లుపాడు మండలం ఒబాయిపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ట భక్తిశ్రద్ధలనడుమ వైభవంగా జరిగింది. ఈ మహోత్సవంలో గిద్దలూరు మాజీ శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలతోపాటు మండలంలోని భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.





## ఒంగోలు జిజిహెచ్ లో అరుదైన శస్త్ర చికిత్స - ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 22**

ఒంగోలు ప్రభుత్వ జనరల్ వెద్యశాల (జిజిహెచ్) న్యూరాలజీ విభాగంలో ప్రాణాంతకరమైన జీబీ సింద్రోమ్ అనే వ్యాధిగ్రస్తునికి చికిత్స అందించి డిస్చార్జ్ చేయడం జరుగుతుందని జిజిహెచ్ ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ తెలిపారు. సోమవారం జి జి హెచ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న నాగేశ్వర్ రెడ్డి అనే యువకుడు వాంతులు విరేచనాలు అయ్యాయని వారం తర్వాత ఒక చెయ్యి పట్టు దొరకలేదని రెండవ చేయి పట్టుకోల్పోవడం రెండు కాళ్లు పట్టుకుపోవటంతో జిజిహెచ్ కు రావడం జరిగిందన్నారు. క్యాజువాలిటీలో న్యూజియో ఫిజీషియన్ డాక్టర్ హరి పరీక్షించి జిబి సింద్రోమ్ అనే వ్యాధిగా నిర్ధారించి ఐదు రోజులు పాటు చికిత్సలు అందించారన్నారు. వ్యాధికి అత్యంత ఖరీదైన ఐవిఐజి అనే ఇంజక్షన్ వాడటం వల్ల వ్యాధులు నివారించగలిగామని పేషెంట్ ను ప్రాణాపాయం నుండి రక్షించగలిగామని తెలిపారు. ఈ వైద్యానికి ప్రైవేట్ ఆస్పత్రులలో సుమారు రూ.6 లక్షల నుంచి 10 లక్షల




రూపాయలు ఖర్చవుతుందని జిజిహెచ్ లో ఉచితంగా ఇంజక్షన్ అందించామని తెలిపారు. నరాల బలహీనతతో పాటు అనేక రకాల వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నామని జిల్లా ప్రజలు జిజిహెచ్ లో అందుతున్న వైద్య సేవలను ఉపయోగించుకోవాలని డాక్టర్ నామినేని కిరణ్ కుమార్ కోరారు. సమావేశంలో సిఎస్ ఆర్ ఎం ఓ డాక్టర్ మాధవి లత, డిప్యూటీ ఆర్ ఎం ఓ సునీల్ గవాస్కర్ పాల్గొన్నారు.

# త్రిపురాంతకంలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు



**త్రిపురాంతకం పెన్ పవర్ జూన్ 22**

మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండల కేంద్రంలోని శ్రీ పట్టాభిరామ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరిగింది . ఇందులో భాగంగా ఆలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, మహోత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా సాగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# మొక్కుబడిగా మండల సమావేశం




**పొన్నలూరు పెన్ పవర్ జూన్ 22**

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ కొండా బత్తిన మాధవ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జడ్పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో డాక్టర్ పి సుజాత, తాసిల్దార్ వి పుల్లారావు హాజరయ్యారు. అధికారులు తమ శాఖల ద్వారా జరిగే పథకాలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా గంటలోపే సమావేశాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రామాంజనేయులు, పిఎసిఎస్ అధ్యక్షుడు మన్నెం రమణయ్య, ఆయా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంకురార్పణ తో శాస్త్రోక్తంగా ప్రారంభమైన శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు

**– ఆర్కిటెక్చర్ అద్భుతాన్ని ఆవిష్కరించిన వటపత్ర శాయి అష్ట దిక్పాలురు కళా కృతులు**





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూన్ 22**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ వైఖానస ఆగమపండితులు పరాంకు శం సీతా రామాచార్యులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు నాందీ సూచకంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విష్వక్సేన పూజ, మేదినీ పూజ, పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం, వాస్తు హోమం, ధ్వజదండ, ధ్వజపట గరుడ ప్రతిష్ఠ నిర్వహించారు. శ్రీవారికి గరుత్మంతుణ్ణికి నడుమ మహా మండపం సీలింగు పై భగవంతుని సర్వవ్యాపకత్వం చాటుతూ అష్టదిక్పాలురు నడుమ వటపత్ర శాయి పవళించి ఉన్న కళా ఖండాన్ని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్ ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు ఆలూరు లక్ష్మీ కుమారి ఆలూరు జై శంకర్ ఆలూరు కుమార ఆత్రేయ తదితరులు ఆవిష్కరించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ధ్వజారోహణం, సాయంత్రం పొన్నూరు వెంకట శ్రీనివాసులు చే ఆధ్యాత్మిక ఉపన్యాసం జరుగుతాయి.

# రెండు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్**

**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 22**


కృష్ణంశెట్టి పల్లె సబ్ స్టేషన్ పరిధిలో ఆర్డీఎస్ ఎస్ పనుల నిమిత్తం నేడు , ఎల్లుండి 23 24 తేదీల్లో ఉదయం గం.10:00 ల నుండి సాయంత్రం గం.07:00 వరకు కృష్ణంశెట్టి పల్లె టౌన్ విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాము. గ్రామ ప్రజలు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ముండ్లపాడు సెక్షన్ ఆఫీసర్ ఒక ప్రకటనలో కోరారు.

# ప్రకృతికి ఆలవాలం. సమస్త జీవరాశికి జీవనాడి “రైన్ ఫారెస్ట్”

**మానవుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ అభివృద్ధికి అడవులు ఎంతో అవసరం.**

**అడవుల నరికివేతతో భవితకు ప్రమాదం .వర్షారణ్యాలను కాపాడుకుందాం -జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.స్వరూపరెడ్డి.**





**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 22**

భూ ఉపరితలంలో దాదాపు మూడింట ఒక వంతు అడవులే ఉన్నాయి. అడవులంటే కేవలం పచ్చదనమే కాదు. పలు రకాల జాతులకు, జంతువులకు ఆవాసాలు. ప్రజలకు జీవనోపాధిని కలిగించే కర్మాగారాలు. అంతేకాదు ఆరోగ్యకరమైన అడవులు కార్బన్ సింక్‌లుగా పనిచేస్తాయని జనవిజ్ఞాన వేదిక రాస్తానాయకులు స్వరూపరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ రైన్ ఫారెస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదికలో జరిగిన కార్యక్రమంలో స్వరూపరెడ్డి పాల్గొని ప్రసంగించారు సంవత్సరానికి బిలియన్ల మెట్రిక్ టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌ను ఇవి గ్రహిస్తాయి. ఇవే కాకుండా వాతావరణ మార్పులను కంట్రోల్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయని, వీటిని నరికివేయడం వల్ల వాతావరణంలో తీవ్రమార్పులు చోటు చేసుకుంటాయన్నారు. ఇవి ఆరోగ్యంపై దుష్ప్రభావాలను చూపిస్తాయని పేర్కొన్నారు. అడవులు వాతావరణంపై తీవ్రమైన మార్పులు చూపిస్తాయి. వాతావరణ మార్పుల కారణంగా పర్యావరణ పరిస్థితుల్లో మార్పు వస్తుందని. ఇవి అలెర్జీ కారకాలను ఉత్పత్తి చేసే అటవీ జాతుల ఆవిర్భావానికి కారణం అవుతాయన్నారు. అంతేకాకుండా పలు వ్యాధుల ఆవిర్భావానికి ప్రధాన కారణమవుతాయన్నారు. ఉష్ణోగ్రతల్లోని తీవ్రమైన మార్పులు భూమిని కూడా సూర్యుడి మాదిరిగా వేడి పుట్టించేలా చేస్తాయని, ఇప్పటికే పెరిగిన ఉష్ణోగ్రతలు మనుషులపై తీవ్ర ప్రభావాలు చూపిస్తున్నాయని. వేడి పెరిగితే మంచు కరిగి.. తీవ్రమైన వరదలు వచ్చే ప్రమాదం ఎక్కువ ఉంటుందన్నారు. ప్రపంచంలోని వర్షారణ్యాలను రక్షించడం , ప్రోత్సహించడం కోసం ఏటా జూన్ 22వ తేదీన ప్రపంచ రెయిన్‌ఫారెస్ట్ డేని నిర్వహిస్తున్నారు. వర్షారణ్యాలు మంచినీరు, స్వచ్ఛమైన గాలి వంటి అనేక వనరులకు మూలం. ఎందుకంటే అవి కార్బన్ డయాక్సైడ్‌తో సహా హానికరమైన వాయువులను గ్రహిస్తాయని, తద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడుకోవడంలో ఇవి ముఖ్యమైన పాత్రను పోషిస్తాయన్నారు. జూన్ 22వ తేదీ 2017న మొదటిసారిగా ప్రపంచ రెయిన్‌ఫారెస్ట్ డేని గుర్తించారు. రెయిన్‌ఫారెస్ట్ భాగస్వామ్యం ఉష్ణమండల వర్షారణ్యాలను సంరక్షించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని. పర్యావరణ వ్యవస్థలో అంతర్భాగమైన ప్రపంచంలోని వర్షారణ్యాలను రక్షించడమే ఈ చొరవ వెనుక ఉన్న ఎజెండా అన్నారు. రెయిన్‌ఫారెస్ట్‌లు అమూల్యమైన జన్యు వనరులు, లెక్కలేనన్ని పరిణామ అద్భుతాలు మాత్రమే కాకుండా.. అవి “జీవన ఫార్మసీలు”గా పరిగణిస్తారని. ఇవే



కాకుండా వైవిధ్యమైన కొత్త మందులు, చికిత్సలకు ఉపయోగకరమైన వనరు. ఇది కాఫీ, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, కూరగాయలతో సహా మన జీవితంలో రోజువారీ వినియోగ ఉత్పత్తులకు మూలం. అనేక సాధారణ పరిశుభ్రత, ఆహార ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా రెయిన్‌ఫారెస్ట్ నిర్మూలనతో నేరుగా ముడిపడి ఉన్నాయన్నారు. అటవీ నిర్మూలన, విలువైన వనరుల విధ్వంసంపై దృష్టి పెట్టాలని ఈ రోజు ఉద్ఘాటిస్తుందన్నారు.

# బాదినేని పల్లె ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సహాయం

***విద్యార్థులకు పదివేల రూపాయలు విలువ చేసే నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ,కాపీ రైటింగ్ పుస్తకాలు తదితర వాటిని పంపిణీ చేసిన దివ్య హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు లొక్కు శరత్ బాబు***



**కొమరోలు పెన్ పవర్ జూన్ 22**

కొమరోలు మండలం బాధినేనిపల్లిలో గల మండల ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన దివ్య హెల్పింగ్ హాండ్స్ సౌజన్యంతో ఆ సంస్థ అధ్యక్షులు శరత్ బాబు ఆధ్వర్యంలో సోమవారం పదివేల రూపాయలు చేసే నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కాపీ రైటింగ్ పుస్తకాలు ,ఎరైజర్లు, షార్పర్స్ తదితర వస్తు సామాగ్రిని పంపిణీ చేశారు. దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ గిద్దలూరు నియోజకవర్గంలో పేద నిరుపేదలకు, వికలాంగులకు ,పేద విద్యార్థులకు, అనాధలకు, వితంతువులకు తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తూ ఆదుకుంటున్నది. మానవసేవే మాధవ సేవగా భావించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ పలువురి మన్ననలను ప్రశంసలను అందుకుంటున్నది. చనిపోయిన వారి మృతదేహాలను ఒకటి రెండు రోజులపాటు భద్రపరచి దూర ప్రాంతంలో ఉన్న బంధుమిత్రులు వచ్చి కడచూపు చూసుకునే భాగ్యం కల్పించాలని ఆశయంతో దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ దాతల సహకారంతో లక్ష రూపాయల వ్యయంతో ఫ్రీజర్ బాక్స్ ను గత రెండేళ్ల క్రితం కొనుగోలు చేసి ప్రజలకు అందుబాటులో ఉండే వీలుగా కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేశారు. కాగా, రెండవ ఫ్రీజర్ బాక్స్ కూడా కొనుగోలు చేసి పేద నిరుపేదలకు మరింత సౌకర్యాలు కల్పించాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. కాగా కొమరోలు మండలం బాదినేని పల్లె మండల మండల ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం పదివేల రూపాయల వ్యయంతో 200 నోటు పుస్తకాలు ,పెన్నులు, పెన్సిళ్లు ,కాపీ రైటింగ్ పుస్తకాలు, ఎరైజర్లు, షార్పర్స్ తదితర వస్తు సామాగ్రిని కొనుగోలు చేసి సోమవారం ఆ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం వారికి అవసరమైన సామాగ్రిని అందజేసిన దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు లొక్కు శరత్ బాబుకు, కార్యవర్గ సభ్యులకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులిగోటి సుబ్బరాయుడు, సహోపాధ్యాయులు సుజాత, చంద్రశేఖర్, పాండురంగ తోపాటు గ్రామ పెద్దలు అభినందించారు. ఆ కార్యక్రమంలో దివ్య హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు శరత్ బాబు, కార్యవర్గ సభ్యులు సుమన్, కలగొట్ల సిద్దయ్య, కారుమంచి చిన్న పీరయ్య, బాలు, ఆ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి ముత్తుముల ఎల్లారెడ్డి,రిటైర్డ్ కానిస్టేబుల్ కామూరి రమణారెడ్డి ,శేషయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొని విద్యార్థులకు వస్తు సామాగ్రి పంపిణీ చేశారు.

# యోగానంద లక్ష్మి నారసింహ స్వామికి బంగారు ఉంగరం బహూకరణ

**స్వామి వారి కైంకర్యాలకు దాతలు ముందుకు రావాలి.**

**దేవాలయ అభివృద్ధికి దాతలు, భక్తులు సహకారం అందించాలి.**

**ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు పిలుపు.**



**సింగరాయకొండ, జరుగుమల్లి జూన్ 22, పెన్ పవర్**

దేవాలయాల పరిరక్షణ అభివృద్ధి సనాతన ధర్మ సేవలో యోగానంద లక్ష్మి నారసింహ స్వామి భక్తులు,దాతలు ముందుకు వచ్చి తమవంతు కైంకర్యాలు,విరాళాలు సమర్పించాలని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు పిలుపు ఇచ్చారు. పాత సింగరాయకొండ శ్రీ శ్రీ శ్రీ యోగానంద లక్ష్మి నారసింహ శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మి నారసింహ క్షేత్రం లో వేంచేసి భక్తుల కొంగు బంగారు గా ఉన్న యోగానంద లక్ష్మి నారసింహ స్వామి వారికి సింగరాయకొండ కి చెందిన భక్తుడు జవంగుల ఆదినారాయణ కుటుంబ సభ్యులు రెండు లక్షల 35 వేలు విలువ చేసే రాళ్ళు పొదిగిన బంగారు ఉంగరాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు దేవాలయ కార్యనిర్వహణ అధికారి పాతకోట కృష్ణవేణి కి అందజేశారు. ఈ సందర్భంగా భక్తుడు ఆదినారాయణ, ఆయన కుటుంబ సభ్యులు వివరిస్తూ తమకి యోగానంద లక్ష్మి నారసింహ స్వామి వారి మీద ఉన్న విశ్వాసం, భక్తి విశ్వాసాల కారణంగా ప్రత్యేకంగా ఉంచిన నిధుల నుండి స్వామి వారికి బంగారు ఉంగరం సమర్పించుకునే అవకాశం కలిగిందన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ ఉంగరాన్ని యోగానంద లక్ష్మి నారసింహ స్వామి వారికి అలంకరించాలని ఆదినారాయణ కోరారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, ఇ ఒ కృష్ణ వేణి, అర్చకులు ఉదయగి శేష లక్ష్మి నారసింహ చార్యులు, ఉదయగిరి లక్ష్మి నారసింహ చార్యులు, ఉదయగిరి సుదర్శన చార్యులు ఆలయ సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# రైతన్న మీకోసం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన

**వ్యవసాయాధికారి పి మధుబాబు**



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 22**

మండలంలోని ముండ్లపాడు, డీటీ పల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన “రైతన్న మీకోసం” కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ శాఖాధికారి పి. మధుబాబు ఇంటింటికి వెళ్లి రైతులను కలుసుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ ఆర్థిక సహాయం రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని తెలియజేశారు.అలాగే ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై ఎల్నినో ప్రభావం, పంటల నిర్వహణలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఏపీఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా, డీఏపీ వంటి ఎరువుల పారదర్శక పంపిణీ జరుగుతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, సబ్సిడీ కార్యక్రమాల గురించి రైతులకు వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అందించే సేవలను వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ నాయకులు రైతులు పాల్గొన్నారు.

# ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తి ప్రాణాలు కాపాడిన మార్కాపురం జిల్లా పోలీసులు



**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూన్ 22**

మార్కాపురం పట్టణంలో నివాసం ఉంటున్న బండి రామదాసు ం/శీ యేసు రత్నం 35సంవత్సరాలు అనే వ్యక్తి కుటుంబ సమస్యల కారణంగా ఈరోజు సాయంత్రం సుమారు ఆరు గంటలకు తాను చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు మరియు స్నేహితులకు ఫోన్ చేసి చెప్పాడు.ఈ విషయాన్ని తెలుసుకున్న తన స్నేహితుడు అద్దంకి మాధవ డయల్ 112 కి ఫోన్ చేసి వారి ద్వారా వెంటనే మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు మరియు సీఐ అల్తాఫ్ హుస్సేన్ ఆదేశాల మేరకు ఎస్సై వేమన మరియు సిబ్బంది, ఐటీ కోర్ టీం సాయంతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి బండి రాములు ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు.వెంటనే రైల్వే ట్రాక్ వద్దకు చేరుకొని అతని ప్రాణాలను కాపాడడం జరిగింది.ఆ తర్వాత అతనికి కౌన్సిలింగ్ నిర్వహించి, మానసికంగా ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెంటనే స్పందించి సదరు వ్యక్తి యొక్క ప్రాణాలను చాకచక్యంతో కాపాడిన పోలీసులకు అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. విధి నిర్వహణలో మంచి పనితీరు కనబర్చిన మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై వి.వేమన మరియు సిబ్బంది హోంగార్డు నోవా, డ్రైవర్ బాషా మరియు ఐటి కోర్ సిబ్బందిని మార్కాపురం జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు అభినందించారు.

# అవకాశాలను అందిపుచ్చుకోండి..!

- పెట్టుబడిదారులకు కలెక్టర్ పిలుపు - పెట్టుబడులకు విస్తృత అవకాశాలు - ఉత్పత్తుల ఎగుమతి, రవాణాకు -అందుబాటులో ఉత్తమ మార్గాలు

- ప్రకాశంజిల్లా పారిశ్రామికాభివృద్ధిలో ' కెటలిస్టు ' గా మారండి -జిల్లాలోని పరిస్థితులపై స్వయంగా ప్రజెంటేషన్

- ఒంగోలులోని ఎస్.జి.వి.ఎస్. కన్వెన్షన్ సెంటర్లో -ఘనంగా 'ఎలైట్ బిజినెస్ మీట్ '- పాల్గొన్న జిల్లాలోని ప్రజాప్రతినిధులు






**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 22**

ప్రకాశం జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి శోభను సంతరించుకోనుంది. భారీ పెట్టుబడులకు ఈ జిల్లా గమ్యస్థానం కానుంది. ఇక్కడి మానవ వనరులు, సహజ వనరులను సమర్ధంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఇచ్చిన పిలుపుతో పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. స్థానిక ఎస్. జి.వి.ఎస్. కన్వెన్షన్ సెంటర్లో సోమవారం నిర్వహించిన ' ఎలైట్ బిజినెస్ మీట్ ' ఈ పెట్టుబడులకు మార్గంగా మారింది. కలెక్టర్ తో పాటు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమం ప్రకాశం జిల్లాలో ఉన్న పారిశ్రామిక అవకాశాలను పెట్టుబడిదారుల దృష్టికి తీసుకువెళ్ళింది.

**ఇది అవకాశాల ఖిల్లా...!..:** పెట్టుబడులు పెట్టేందుకు జిల్లాలో ఉన్న అవకాశాలను స్వయంగా కలెక్టరే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ కార్యక్రమంలో వివరించారు. ప్రకాశం జిల్లా... అవకాశాల ఖిల్లా అని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో జిల్లా తలసరి ఆదాయం రూ.2,17,511 గా ఉందని, జిల్లా స్థూల ఉత్పత్తి రూ.73,331 కోట్లుగా నమోదయిందని తెలిపారు. వృద్ధిరేటు 15.3 శాతంగా ఉందన్నారు. జిల్లాలో రామయపట్నం పోర్టు, బీపీసీఎల్, ఇండోసోల్ కంపెనీలతోపాటు జిందాల్ స్టీల్ కంపెనీ కూడా ఐరన్ ఓర్ తవ్వకాల ప్రతిపాదనతో వచ్చిందన్నారు. మరోవైపు దొనకొండ మండలంలో 25వేల ఎకరాలతో మెగా ఇండస్ట్రియల్ పార్కు అందుబాటులో ఉందని చెప్పారు. జాతీయ రహదారులు, బెంగళూరు - కడప - విజయవాడ ఎక్స్ప్రెస్ హైవేలు రవాణా వ్యవస్థ రూపురేఖలను మార్చాయన్నారు. విస్తృత అభివృద్ధికి అవకాశం ఉన్న 20 కిలోమీటర్ల కోస్తా తీరం కూడా ప్రకాశం జిల్లా సొంతమన్నారు. ప్రపంచంలోని 50 శాతం నగరాలు సముద్రతీరం వెంబడే అభివృద్ధి చెందాయని కలెక్టర్ వివరించారు. ఈ చారిత్రక వాస్తవాలను, స్థానికంగా ఉన్న అవకాశాలను వినియోగించుకొని పెట్టుబడులతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సోషల్, ఇండస్ట్రియల్, సర్వీస్ రంగాలలో ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుని ప్రకాశం జిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో కెటలిస్టు గా మారాలని పెట్టుబడిదారులను కోరారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో పారిశ్రామిక రంగానిది కీలక పాత్ర అన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ దృష్ట్యా అన్ని జిల్లాల్లోని అవకాశాలను అధికార యంత్రాంగ వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని అవకాశాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

**ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ... :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా , మొట్ట మొదటగా ప్రకాశం జిల్లాలోనే ఇటువంటి పారిశ్రామిక వేత్తల సదస్సు పెట్టడం శుభపరిణామన్నారు. ఒంగోలు నగరాన్ని పారిశ్రామిక హబ్ గా తయారు చెయ్యటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఒంగోలులో ఇండస్ట్రియల్ మోడల్ టౌన్ షిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక పారిశ్రామిక వేత్తలు ప్రకాశం లో పెట్టుబడులు పెట్టి ఇక్కడ అబివృద్ధి కి పాటుపడాలని ఆయన కోరారు. ఈ పారిశ్రామిక వేత్తల సమావేశానికి వచ్చిన పారిశ్రామిక వేత్తలు మొత్తం రూ.20 వేల కోట్లు పెట్టుబడి పెట్టే సామర్థ్యం ఉన్న వారన్నారు. ప్రకాశం జిల్లాలో పారిశ్రామికంగా మంచి అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరు దానిని ఉపయోగించుకుని పెట్టుబడులు పెట్టాలన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలంగా ఉంచాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరికన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాని హార్టికల్చర్ హబ్ గా తయారు చెయ్యటానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. హార్టికల్చర్ , పొగాకు కోల్డ్ స్టోరేజ్ ల నిర్మాణానికి మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ ఒంగోలులో త్వరలో ఫిషింగ్ హార్బర్ , ఎయిర్ పోర్టు వస్తున్నాయన్నారు. ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 ఏళ్లు అవుతున్న సందర్భంగా నగరంలో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. హోటళ్ళు, కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్మాణాలకు ఆసక్తి ఉన్నవారు ప్రతిపాదనలతో ముందుకు రావాలని ఆయన కోరారు. నగర అభివృద్ధిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మ్యారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా అభివృద్ధికి రామయ్యపట్నం పోర్టు, వెలుగొండ ప్రాజెక్టు కీలకం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి ఈ రెండింటినీ అందుబాటులోకి తీసుకువస్తున్నందున పారిశ్రామికవేత్తలు పెట్టుబడులతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రామాయపట్నం పోర్టు ఆధారంగా పెట్రో కెమికల్ పరిశ్రమలకు అవకాశం ఉందన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులకు కూడా ప్రకాశం జిల్లాలో అత్యధిక అవకాశాలు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ప్రత్యేక సెజ్ కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ' ఈజ్ ఆఫ్ డూయింగ్ - స్పీడ్ ఆఫ్ బిజినెస్ ' విధానంతో సింగల్ విండో ద్వారా అనుమతులను త్వరగా ఇస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది డిసెంబరు లేదా వచ్చే మార్చి నాటికి గ్రీన్ పోర్టులు కూడా పూర్తవుతాయన్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకొని పెట్టుబడులతో రావాలని పారిశ్రామికవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ గుండాయపాలెం బీచ్ ను కేరళలోని అలెప్పీ బీచ్ మాదిరిగా అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కొత్తపట్నం, పాకల బీచ్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. అద్దంకి భవనాసి చెరువును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో బోటింగ్, టెంపుల్ టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ రంగంలో పెట్టుబడికి ఉన్న అవకాశాలను వినియోగించుకునేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బి.ఎన్. విజయకుమార్, ఏలూరి సాంబశివరావు, కందుల నారాయణరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త మాగుంట రాఘవ రెడ్డి, పలువురు పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

## రూ.12 వేల కోట్లతో శ్రీశైలం కారిడార్ నిర్మాణం

**బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి**

**మార్కాపురం పెన్ పవర్ జూన్22**



శ్రీశైలం మహాక్షేత్రానికి వెళ్లే కోట్లాది మంది భక్తులకు ఇక ప్రయాణం మరింత సులభం కానుందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామ చంద్రారెడ్డి తెలిపారు. దశాబ్దాలుగా ఘాట్ రోడ్లలో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రమాదకర మలుపులు, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టిందన్నారు. సుమారు రూ.12,000 కోట్ల వ్యయంతో శ్రీశైలం కారిడార్ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఆధ్యాత్మిక పర్యాటక రంగానికి కొత్త ఊపిరి పోసే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పూర్తయితే శ్రీశైలం యాత్ర మరింత వేగవంతంగా, సురక్షితంగా మారనుందని డాక్టర్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న శైవ భక్తులకు ఇది ఒక మహా వరంగా నిలవనుందన్నారు. కేవలం రహదారి నిర్మాణానికే పరిమితం కాకుండా ప్రాంతీయ అభివృద్ధి, పర్యాటక రంగ విస్తరణ, ఉపాధి అవకాశాల సృష్టికి కూడా ఈ కారిడార్ దోహదపడుతుందని తెలిపారు. దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఆధునిక సదుపాయాలతో అనుసంధానం చేయాలనే ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టికి ఈ ప్రాజెక్టు మరో నిదర్శనమని ఆయన అన్నారు. కాశీ విశ్వనాథ్ కారిడార్, మహాకాళ్ లోక్, అయోధ్య అభివృద్ధి వంటి మహత్తర కార్యక్రమాల అనంతరం ఇప్పుడు శ్రీశైలం అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

## ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం




**త్రిపురాంతకం పెన్ పవర్ జూన్ 22**

త్రిపురాంతకం మండల కేంద్రంలోని శ్రీ పట్టాభిరామస్వామి వారి ఆలయం మరియు శ్రీ పోలేరమ్మ తల్లి గుడి ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి గూడూరు ఎరిక్సన్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరి ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సమృద్ధి కోసం, రైతాంగం పంటలతో పచ్చగా కళకళలాడాలని, యువతకు మంచి భవిష్యత్తు కలగాలని, ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలని దేవుని ఆశీస్సులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు మోటకట్ల శ్రీనివాస్ రెడ్డి, చల్లా వెంకట రెడ్డి, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

## సాంకేతికతను పాటించి అధిక దిగుబడులు సాధించాలి





**పొన్నలూరు పెన్ పవర్ జూన్ 22**

రైతులు వ్యవసాయంలో మేలైన సాంకేతిక పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సంచాలకులు ప్రత్యేక అధికారి ఈ నిర్మల కుమారి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహ సమీపంలో సోమవారం వ్యవసాయ అధికారి వి రాము ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమారి మాట్లాడుతూ రైతులు డిమాండ్ ఆధారిత పంటలు వేసుకోవాలని, నీటిని ఆదా చేసే తక్కువ కాలపరిమితి గల పంటలను వేసుకొని ఎల్ నీ నో ప్రభావం ద్వారా వర్ష భావన పరిస్థితుల వల్ల నీటిని ఆదా చేసుకోవాలని తెలిపారు. రైతులు ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా నమోదు చేసుకొని ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, విత్తనాలు, ఎరువులు 15 రకాల సేవలు యాప్ లో అందుబాటులో ఉంటాయని అన్నారు. రాము మాట్లాడుతూ మండలంలో పచ్చిరొట్ట ఎరువులైన జలుములు 50% రాయితీతో 173 క్వింటాలు రైతుల పేర్లు నమోదు చేసి పంపిణీ చేసినట్లు తెలిపారు. కావలసిన రైతులు రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండవ ప్రసాద్, మండవ మురళీకృష్ణ, వ్యవసాయ సహాయకులు టీవీ వెంకటనారాయణ వ్యవసాయ సిబ్బంది అనూష,లక్ష్మి, మందాకిని తదితరులు పాల్గొన్నారు.

## కరువు పనుల్లో మొబైల్ యాప్ రద్దు చేయాలి: తోట గురునాథం

**పెద్దారవీడు, పెన్ పవర్ జూన్ 22**



కరువు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ కరువు పనుల్లో మొబైల్ యాప్ వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దారవీడు మండలం సోషల్ మీడియా జనరల్ సెక్రటరీ తోట గురునాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొబైల్ యాప్ ద్వారా హాజరు నమోదు ప్రక్రియలో నెట్‌వర్క్ సమస్యలు, సాంకేతిక లోపాలు, ఫోటో అప్‌లోడ్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కారణంగా కూలీలు పనిదినాలు కోల్పోవడంతో పాటు వేతనాల చెల్లింపులో కూడా జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన ఇంటర్నెట్ సౌకర్యం లేని పరిస్థితుల్లో మొబైల్ యాప్ ఆధారిత హాజరు విధానం కూలీలకు భారంగా మారిందని పేర్కొన్నారు. కరువు సమయంలో ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వం సాంకేతిక సమస్యలతో కూలీలను ఇబ్బందులకు గురి చేయకుండా, గతంలో అమలులో ఉన్న సులభమైన హాజరు విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు.

## వృద్ధాశ్రమ వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేసిన దుగ్గా సరళ రెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 22**

మండలంలోని దర్శిగుంటపేట పంచాయతీ పరిధిలోని బొంతవారిపల్లి గ్రామానికి చెందిన దుగ్గా కోనారెడ్డి సతీమణి జయమ్మ వర్ధంతి సందర్భంగా సోమవారం కనిగిరిలోని వాసవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్న భోజనాలను ఏర్పాటు చేసి దుగ్గా రాజశేఖర్ రెడ్డి సతీమణి దుగ్గా సరళ రెడ్డి (కోడలు) తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆత్మీయంగా భోజనాలు వడ్డించి వారి ఆశీర్వాదాలను పొందారు. జయమ్మ స్మారకార్థంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని వృద్ధాశ్రమ నిర్వాహకులు, వృద్ధులు అభినందించారు. వాసవి వృద్ధాశ్రమం మేనేజర్ మాట్లాడుతూ జయమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని తెలిపారు. అలాగే సరళ రెడ్డి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సిరిసంపదలతో కలకాలం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ. 2,03,455/- లు

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 22**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.2,03,455/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా రూ. 82,660/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,830/- లు, శాశ్వత అన్నదానం నకు విరాళంల ద్వారా రూ,63,417/- లు , స్వామివారి పంచామృత అభిషేకమునకు రూ .16,548/- లు, స్వామివారికి శ్రీపాద కానుకలు రూ.3,000/- లు వచ్చినట్లు తెలిపారు.

## ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన విరమించుకోవాలి

**సి ఎస్ పురం , పెన్ పవర్ జూన్ 22**



రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచనను విరమించుకోవాలని జిల్లా వైఎస్సార్సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మితికాల గురవయ్య అన్నారు. రాష్ట్ర వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్ రెడ్డి సూచనల మేరకు జిల్లా ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మితికేలా గురవయ్య మాట్లాడుతూ ఆర్టీసీ కేవలం రవాణా సంస్థ మాత్రమే కాకుండా కోట్లాది ప్రజల జీవన విధానంలో భాగమైందన్నారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలకు సైతం ప్రజలకు అందుబాటులో సేవలు అందిస్తున్న ఆర్టీసీని ప్రైవేటీకరించడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సేవ లక్ష్యంగా ఏర్పడిన సంస్థను లాభనష్టాల కోణంలో కాకుండా సామాజిక బాధ్యతతో కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఆర్టీసీని బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను పరిరక్షిస్తూ ఆర్టీసీ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రైవేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకోవాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షులు కోటి యాదవ్, జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ , ఒంగోలు 22వ డివిజన్ అధ్యక్షుడు కుట్టుబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడు - శ్రీశైలం ఆర్టీసీ బస్సుకు తప్పిన ముప్పు..





### అదుపుతప్పి చెట్టును ఢీకొన్న సూపర్ లగ్జరీ!

**పెద్దారవీడు పెన్ పవర్ జూన్ 22**

మండల పరిధిలోని చట్లమిట్ట సమీపములో సోమవారం తెల్లవారుజామున ఒక ఆర్టీసీ బస్సుకు తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. నూజివీడు నుండి శ్రీశైలం వెళ్తున్న ఏపీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ప్రయాణికులతో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తెల్లవారు జామున చీకటిగా ఉన్న సమయంలో రోడ్డుపై అప్పటికే చనిపోయి ఉన్న ఒక గేదెను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దాంతో ఒక్కసారిగా బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సు డ్రైవర్ సమయస్ఫూర్తితో, చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సులో ఉన్న 15 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ప్రయాణికులందరూ ఊపిరి పీల్చుకున్నారు. చెట్టును బలంగా ఢీకొట్టడంతో బస్సు ముందు భాగం దెబ్బతిని, డ్రైవర్ స్టీరింగ్‌లో చిక్కుకుపోయారు. స్థానికులు, సహాయక సిబ్బంది తీవ్రంగా శ్రమించి ఆయనను బయటకు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, డ్రైవర్‌కు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఆయనను మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు, తదుపరి చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

## 28న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- అధికారులకు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆదేశం

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 22**



జిల్లాలో ఈనెల 28 వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి జిల్లా అధికారి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనం లోని పి.జి.ఆర్.ఎస్. భవన్ లో పల్స్ పోలియో జిల్లా టాస్క్‌ఫోర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 156477 మంది 0 -5 సంవత్సరాల పిలల్లు ఉన్నారని వారి అందరికి పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతున్న మొదటి రోజు అన్ని పోలింగ్ కేంద్రాలలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అలా ఎవరైనా మొదటి రోజు పోలియో చుక్కలు వేసుకోని యెడలా రెండవ, మూడవ రోజులలో ప్రతి ఇంటిని గుర్తించి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 1062 పోలియో కేంద్రాలు ,34 ట్రాన్సిట్ పోలియో కేంద్రాలు 69 మొబైల్ పోలియో కేంద్రాలు ఏర్పాటుచేయడం జరిగినది అని తెలిపారు. ఈ కార్యక్రమము విజయవంతం చేయుటకు మొత్తం 4937 మంది వైద్యులు పారామెడికల్ సిబ్బంది ఆషా లు, అంగన్వాడీ వర్కర్లు వాలంటరీ స్ ను నిమించడం జరిగిందని తెలిపారు. జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రకాశం జిల్లా ని పోలియో రహిత జిల్లాగా చేయవలసినదిగా అధికారులను కోరారు. అనంతరం పల్స్ పోలియో 2026 సంబంధించిన గోడ పత్రికలను జాయింట్ కలెక్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కమల శ్రీ, డాక్టర్ భగీరధి, మాస్ మీడియా అధికారులు శ్రీనివాసులు, శ్రీదేవి, జవహర్, రామాంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మగా.. క్రికెటర్‌గా.. రెండింటినీ బ్యాలెన్స్ చేసేలా ఐసీసీ కొత్త పాలసీ



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళా క్రికెటర్ల కెరీర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లేలా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఒక మైండ్ బ్లోయింగ్ ప్లాన్ వేసింది. డెలివరి తర్వాత మహిళా క్రికెటర్లు మళ్లీ మైదానంలోకి రీ-ఎంట్రీ ఇచ్చేందుకు వీలుగా రిటర్న్ టు ప్లే పోస్ట్-ప్రెగ్నెన్సీ గైడ్‌లైన్స్ ను లాంచ్ చేసింది. మాతృత్వం, క్రికెట్ అనేవి వేర్వేరు కాదు.. రెండూ కలిసే కొనసాగవచ్చు అనే మెసేజ్‌తో ఈ సరికొత్త రూల్స్ తీసుకొచ్చింది. మహిళా క్రికెట్ ప్రొఫెషనల్‌గా మారుతుండటంతో.. వారి సంక్షేమాన్ని, ఆటను బ్యాలెన్స్ చేయడానికి ఐసీసీ ఈ స్టెప్ వేసింది. గర్భధారణకు సంబంధించిన నిర్ణయాలు పూర్తిగా ప్లేయర్ల వ్యక్తిగతం, క్రికెట్ బోర్డులు ఎలాంటి ప్రెగ్నెన్సీ టెస్టులు తప్పనిసరి చేయొద్దని ఐసీసీ క్లియర్‌గా చెప్పింది. మహిళా క్రికెటర్లు ప్రసవం తర్వాత గ్రౌండ్‌లోకి అడుగు పెట్టేందుకు ఐసీసీ అద్భుతమైన 6 =o ఫ్రేమ్‌వర్క్‌ను సెట్ చేసింది. ప్రసవం జరిగిన మొదటి 6 వారాల్లో రెడీ దశతో మొదలు పెట్టి తేలికపాటి కదలికలు, సైకలాజికల్ సపోర్ట్ అందిస్తారు. ఆ తర్వాత 6-8 వారాల్లో రివ్యూ దశలో మెడికల్ స్పెషలిస్టు వారి రికవరీని అసెస్ చేస్తారు. 8-16 వారాల్లో రీస్టోర్ ద్వారా రన్నింగ్, స్ట్రెంత్ ట్రైనింగ్ ప్రారంభిస్తారు. ఆ తర్వాత రీకండిషన్ దశలో గాయాల బారిన పడకుండా బాడీని రీబిల్డ్ చేస్తారు. చివరిగా రిటర్న్, రిఫైన్ దశల ద్వారా ప్లేయర్లు మళ్లీ కాంపిటేటివ్ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు.

**బేబీ కేర్‌తో ట్రావెల్:**
కేవలం ఫిజికల్ రికవరీ మాత్రమే కాదు, ప్రాక్టికల్ సపోర్ట్ సిస్టమ్స్ కోసం ఐసీసీ అదిరిపోయే ఆఫర్స్ తీసుకొచ్చింది. ప్లేయర్లకు ఫ్లెక్సిబుల్ ట్రైనింగ్ ఎన్విరాన్‌మెంట్, చైల్డ్ కేర్, బ్రెస్ట్ ఫీడింగ్ సౌకర్యాలతో పాటు విదేశీ టూర్ల సమయంలో కేర్‌టేకర్‌ను కూడా తమతో పాటు తీసుకెళ్లే క్రేజీ ఆప్షన్ ఇచ్చింది. గర్భధారణ సమయంలో ఆడలేని ప్లేయర్లకు కోచింగ్ లేదా అనలిస్ట్ లాంటి ఆల్టర్నేటివ్ రోల్స్ ఇవ్వాలని, అలాగే రికవరీ పీరియడ్‌లో కాంట్రాక్ట్ ఎక్స్‌టెన్షన్స్ కూడా పరిశీలించాలని ఆయా బోర్డులకు ఐసీసీ సూచించింది. ఈ సమయంలో ప్లేయర్లు ఒంటరిగా ఫీల్ అవ్వకుండా మెడికల్, కోచింగ్ స్టాఫ్‌తో రెగ్యులర్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలని తెలిపింది.

**మైదానంలో రచ్చ లేపిన సూపర్ మామ్స్:**
ఇప్పటికే ఎంతో మంది మహిళా క్రికెటర్లు అమ్మలుగా ప్రమోషన్ పొందాక కూడా ఇంటర్నేషనల్ క్రికెట్‌లో సత్తా చాటి హిస్టరీ క్రియేట్ చేశారు. పాకిస్తాన్ స్టార్ బిస్మా మారూఫ్ ప్రెగ్నెన్సీ బ్రేక్ తర్వాత 2022లో తిరిగొచ్చి ఉమెన్స్ వరల్డ్ కప్‌లో కెప్టెన్‌గా చెలరేగిపోయింది. న్యూజిలాండ్‌కు చెందిన అమీ సాటర్త్‌వైట్ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత రీ-ఎంట్రీ

ఇచ్చి ఎంతోమంది తల్లులకు స్ఫూర్తిగా నిలిచింది. ఆస్ట్రేలియాకు చెందిన సారా ఇలియట్ తల్లయ్యాక కూడా యాషెస్ సిరీస్‌లో సెంచరీతో చెలరేగింది. ఇంగ్లాండ్ లెజెండ్ ఎనిడ్ బేక్‌వెల్ మాతృత్వం తర్వాత ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఎంట్రీ ఇవ్వగా.. వెస్టిండీస్ ప్లేయర్ ఆఫీ ఫ్లెచర్ వికెట్ తీసిన ప్రతిసారీ తన కొడుకు కోసం స్పెషల్ సెలబ్రేషన్స్ చేసేది.. మన ఇండియా నుంచి స్నేహ దీప్తి, కువైట్ నుంచి మరియం ఒమర్ కూడా తల్లైన తర్వాత గ్రౌండ్‌లోకి అడుగుపెట్టి సత్తా చాటారు. మహిళా క్రికెటర్ల కెరీర్‌ను మరింత సస్టైనబుల్‌గా మార్చడంలో ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయం నిజంగా గేమ్ ఛేంజర్.

# 12 ఓవర్లకి 12 పాయింట్లు కట్.. ఇంగ్లాండ్‌కు గట్టి షాక్ ఇచ్చిన ఐసీసీ




**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ జట్టుకు ఒకేసారి రెండు షాక్స్ తగిలాయి. ఒకవైపు రెండో టెస్టులో కివీస్ చేతిలో 253 రన్స్ తేడాతో ఘోర పరాజయం చవిచూడగా, మరోవైపు స్లో ఓవర్ రేట్ కారణంగా ఐసీసీ ఆ జట్టుకు భారీ పెనాల్టీ విధించింది. ఈ పరిణామాలతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరాలనే ఇంగ్లాండ్ ఆశలు మరింత సంక్లిష్టంగా మారాయి. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పట్టికలో ఇంగ్లాండ్ ఏడో స్థానంలో నిలిచింది.

**12 ఓవర్లు లేట్.. 12 పాయింట్లు కట్:**
ఆదివారం ముగిసిన రెండో టెస్టులో ఇంగ్లాండ్ ఓడిపోవడంతో డబ్ల్యూటీసీ పట్టికలో ఆ జట్టు పర్సంటేజీ 34.72 శాతం నుంచి ఒక్కసారిగా 26.38 శాతానికి పడిపోయింది. ఈ టెస్టు మ్యాచ్‌కు ముందు ఇంగ్లాండ్ ఖాతాలో 50 పాయింట్లు ఉన్నాయి. అయితే ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ నిర్ణీత సమయం కంటే ఏకంగా 12 ఓవర్లను ఆలస్యంగా వేయడంతో 12 పాయింట్లను కోల్పోవాల్సి వచ్చింది. దీంతో ఇంగ్లాండ్ పాయింట్ల సంఖ్య 38కి పడిపోయింది.

**ఇంగ్లాండ్ జట్టుకు మ్యాచ్ ఫీజులో 50 శాతం ఫైన్:**
రెగ్యులర్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అందుబాటులో లేకపోవడంతో ఈ మ్యాచ్‌కు జో రూట్ తాత్కాలిక సారథిగా కొనసాగారు. స్లో ఓవర్ రేట్ కారణంగా కేవలం పాయింట్ల కోత మాత్రమే కాకుండా, కెప్టెన్‌గా వ్యవహరించిన జో రూట్‌తో పాటు జట్టులోని సహచరులందరికీ ఐసీసీ 50 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా విధించింది.

**కెప్టెన్ బెన్ స్టోక్స్ రీ-ఎంట్రీ:**
ఇంగ్లాండ్ ఫ్యాన్స్‌కు ఒక గుడ్ న్యూస్.. బాక్సర్‌తో గొడవ కారణంగా రెండో టెస్టుకు దూరమైన రెగ్యులర్ కెప్టెన్ బెన్ స్టోక్స్ మళ్లీ తుది జట్టులోకి రాబోతున్నాడు. న్యూజిలాండ్‌తో జరగబోయే మూడో టెస్టు కోసం ప్రకటించిన స్క్వాడ్‌లో అతనికి చోటు లభించింది. కెప్టెన్ తిరిగి రావడంతో ఇప్పుడు తుది జట్టు నుంచి ఎవరిని పక్కన పెడతారనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమంగా ఉండటంతో, సిరీస్ విజేతను తేల్చే మూడో టెస్టు జూన్ 25 నుంచి నాటింగ్‌హామ్ వేదికగా స్టార్ట్ కానుంది.

## ఐపీఎల్‌లో మరో బిగ్ ట్రేడ్: హార్దిక్ కోసం రాజస్థాన్ ప్రయత్నం.. ఆ స్టార్ ప్లేయర్‌ని ఇవ్వమన్న ముంబై!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్‌కు వచ్చి జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా, ఇప్పుడు ఆ జట్టును వీడేందుకు సిద్ధమయ్యాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్ల మధ్య వచ్చిన విభేదాల వల్లే హార్దిక్ ముంబై ఫ్రాంచైజీని వదిలి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది.

**రాజస్థాన్ నుంచి ముంబైకి రానున్న డాషింగ్ ఓపెనర్:**
రెవ్‌స్పోర్ట్స్ నివేదిక ప్రకారం.. హార్దిక్ పాండ్యాను ట్రేడ్ చేసుకోవడానికి రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ రేసులో ముందుంది. ఈ డీల్‌లో భాగంగా రాజస్థాన్ తమ స్టార్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను ముంబై ఇండియన్స్‌కు అప్పగించనుండగా, హార్దిక్ పాండ్యా ఆర్ఆర్ గూటికి చేరనున్నాడు. ముంబై రంజీ జట్టుకు ఆడే జైస్వాల్‌కు, ఎంఐ ఫ్రాంచైజీలోకి రావడం ఒక పర్ఫెక్ట్ హోమ్‌కమింగ్ లాంటిదని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**అందుకే ముంబై వైపు జైస్వాల్ చూపు:**
గత ఏడాది కాలంగా యశస్వి జైస్వాల్ భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు కొనసాగుతున్నాయి. సంజు శాంసన్ రాజస్థాన్ రాయల్స్ నుంచి నిష్క్రమించిన తర్వాత జైస్వాల్ ఆ జట్టుకు బిగ్గెస్ట్ స్టార్ అవుతాడని, అలాగే కెప్టెన్సీ రేసులోనూ అతనే ముందుంటాడని అందరూ అనుకున్నారు. కానీ రాజస్థాన్ మేనేజ్‌మెంట్ జైస్వాల్‌ను కాదని రియాన్ పరాగ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. అంతేకాదు, బ్యాటింగ్ విభాగంలో 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ అదిరిపోయే పర్ఫామెన్స్‌తో మోస్ట్ ఎక్సైటింగ్ టాలెంట్‌గా ఎదిగాడు. దీంతో తన కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లో పెట్టడానికి రాజస్థాన్ నుంచి బయటకు రావడమే జైస్వాల్‌కు ఉత్తమమైన ఆప్షన్ అని భావించాడు.

**ముంబైలో సీనియర్ల ప్రక్షాళన:**
ముంబై ఇండియన్స్ కేవలం హార్దిక్ పాండ్యానే కాదు, జట్టులోని వయసు పైబడుతున్న సీనియర్ స్టార్లను వదిలించుకోవాలని చూస్తోంది. ఈ క్రమంలోనే టీ20 స్పెషలిస్ట్ సూర్యకుమార్ యాదవ్ కూడా కొత్త టీమ్ కోసం చూస్తున్నట్లు టాక్. ఉత్తరాదికి చెందిన రెండు ఫ్రాంచైజీలు సూర్యకు కెప్టెన్సీ ఆఫర్ ఇస్తూ తమ జట్టులోకి లాగేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి.

# తానొకటి తలచిన.. అన్‌లక్కీ తెలుగమ్మాయ్ తెరవెనక కథ!

పెళ్లి చూపులు- లాంటి క్లాసిక్ బ్లాక్‌బస్టర్ తో సోలో హీరోయిన్‌గా కెరీర్‌ను టేకాఫ్ చేసుకుంది తెలుగమ్మాయి రీతూ వర్మ. అంతకుముందు కొన్నేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా -పెళ్లి చూపులు- తెచ్చిన గుర్తింపే వేరు! ఓవర్ నైట్ స్టార్ డమ్ పెంచిన చిత్రమిది. ఆ తర్వాత దుల్కర్ సల్మాన్, చియాన్ విక్రమ్, గోపీచంద్ లాంటి క్రేజీ ..అగ్ర హీరోల సరసన వరుసగా అవకాశాలను అందుకుంది. అయితే గ్లామర్ పరిశ్రమలో ప్రతిభ ఎంత ఉన్నా.. అదృష్టం కూడా కలిసిరావాలనే దానికి రీతూ వర్మ కెరీర్ ఒక ఉదాహరణ. నటిగా ఎదిగే క్రమంలో.. కమర్షియల్ సినిమాలతో సత్తా చాటుతూ దూసుకెళ్లాల్సిన సమయంలో తన కెరీర్ గురించి ఎంత పెద్దగా ఊహించుకుందో.. అందుకు అతీతంగా దురదృష్టవశాత్తూ కొన్ని దెబ్బలు పడ్డాయి.



బ్రౌన్ రంగులో చేతనా పాండే ఆకర్షణీయమైన 'చాక్లెట్ గ్లామ్' లుక్

ముఖ్యంగా కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ - స్టార్ డైరెక్టర్ గౌతమ్ మీనన్ కాంబినేషన్‌లో వచ్చిన -ధృవనక్షత్రం- తన కెరీర్ గేమ్ ఛేంజ్ చేస్తుందని ఆశించింది. కానీ అలాంటి అత్యంత ప్రతిష్టాత్మక చిత్రంలో హీరోయిన్‌గా అవకాశం దక్కినా అది కలిసి రాలేదు. తన కెరీర్‌ను అంతర్జాతీయ స్థాయికి రీడిఫైన్ చేసేంత గొప్ప ప్రతిభావంతులతో పనిచేసే ఛాన్స్ వచ్చినా దురదృష్టవశాత్తూ ఆ సినిమా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడటం, రిలీజ్ ఏళ్ల తరబడి ఆలస్యం అవ్వడం ఈ తెలుగమ్మాయిని వేధించింది. ఇంతటి క్రేజీ సినిమాలో భాగమయ్యాక కూడా అది ప్రేక్షకులకు దూరం అవ్వడాన్ని రీతూ జీర్ణించుకోలేని దుస్థితి ఏర్పడింది.

అయినా.. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా రీతూ వర్మ మొక్కవోని దీక్షతో తన పంథాలో ముందుకు సాగుతోంది. నటిగా కెరీర్ పరంగా గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా వైవిధ్యమైన సినిమాలను ఎంచుకుంటోంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ సరసన భారీ బడ్జెట్‌తో పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న -భరతవర్ష- సాగా ఆఫ్ షులా- అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాపై రీతూ వర్మ చాలా హోప్స్ పెట్టుకుంది. కెరీర్‌లో తప్పనిసరిగా ఒక భారీ హిట్ పడాల్సిన అత్యంత కీలకమైన సమయంలో ఈ హిస్టారికల్ డ్రామాలో భాగం కావడం విశేషం.

జాతీయ అవార్డు గ్రహీత, వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు సంకల్ప్ రెడ్డి తెరకెక్కిస్తున్న -భరతవర్ష- సాగా ఆఫ్ షులా- సినిమా కథాంశం భారతదేశ ప్రాచీన కాలం, చారిత్రక యుద్ధాల నేపథ్యంతో ముడిపడినది. కమర్షియల్ హంగులతో పాటు అద్భుతమైన విజువల్స్, అప్పటి సంస్కృతీ సంప్రదాయాల నేపథ్యంలో ఒక యోధుడి కథగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమా గోపీచంద్ కెరీర్‌కు పూర్తి వైవిధ్యమైనది.. ఎందుకంటే అతడు తన రెగ్యులర్ మాస్ ఇమేజ్‌ను పక్కనబెట్టి రాజుల కాలం నాటి ఒక సరికొత్త మేకోవర్‌తో కనిపించనున్నారు. అటు సంకల్ప్ మార్క్ మేకింగ్, ఇటు గోపీచంద్ యాక్షన్ ఎలిమెంట్స్ ఈ సినిమాను ఇద్దరి కెరీర్‌కు ఎంతో ప్రత్యేకంగా మార్చబోతున్నాయి.ఈ చారిత్రక కథాంశంలో నటిగా తనను తాను నిరూపించుకోవడానికి రీతూ వర్మకు చాలా ఎక్కువ స్కోప్ ఉంది. కేవలం ఒక సాదాసీదా హీరోయిన్ పాత్రలా కాకుండా... కథను మలుపు తిప్పే బలమైన, రాచరికపు లేదా చారిత్రక ప్రాధాన్యత కలిగిన పాత్రలో తను కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. సంకల్ప్ రెడ్డి సినిమాల్లో మహిళా పాత్రలకు మంచి ప్రాధాన్యత ఉంటుంది కాబట్టి... రీతూ వర్మ తన నటనతో మరోసారి మెప్పించే వీలుంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తే అన్‌లక్కీ హీరోయిన్ అనే ముద్రను చెరిపేసి రీతూ వర్మ దక్షిణాదిన మళ్లీ ఒక రేంజ్‌లో బిజీ అవ్వడం ఖాయం.



బీచ్ ఒడ్డున వర్షిణి సౌందరరాజన్ సహజమైన ఆకర్షణతో మెరిసిపోతున్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com